చంటి బిడ్డల కోసం..



వణికించే చలి. దోమల బెడద. అయినా, ఆరు బయట బాలింతలు ఇలా పడిగాపులు కాసేది లోపల చికిత్స పొందుతున్న పురిటిబిడ్డల కోసం. పుట్టిన శిశువులకు ఆరోగ్య పరిస్థితి బాగలేకుంటే రుయా చిన్నపిల్లల విభాగానికి తీసుకొచ్చి ప్రత్యేక ఐసీయూ, ఎన్ఐసీయూ వార్డుల్లో ఉంచి వైద్యం అందిస్తారు. వారికి పాలు పట్టించేందుకు తల్లులు అందుబాటులోనే ఉండాలి. అందుకని ఆస్పత్రి ఆవరణలోనే వార్డుల పక్కనే వైద్యాధికారులు తల్లులు ఉండేందుకు ప్రత్యేక వసతులను ఏర్పాటు చేశారు. అసలే బాలింతలు. దీనికితోడు ఇన్‌ఫెక్షన్స్ వచ్చే ప్రదేశం. అవేవీ పట్టించుకోకుండా ఆ తల్లులు తమ బిడ్డలు ఆరోగ్యంగా ఏ క్షణాన తమ ఒడికి చేరతారా అని ఆశతో ఎదురు చూస్తూ నిరీక్షిస్తున్నారు. బాలింతల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక గదులు, సదుపాయాలను ఏర్పాటు చేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

పూట గడిచేదే కష్టంగా ఉంది



ఉన్న ఒకటిన్నర ఎకరా నగరి కాల్వకు (గాలేరు- నగరి) ప్రభుత్వం తీసుకుంది. గవర్నమెంటు నుంచి వచ్చిన కొద్దిపాటి నష్టపరిహారం బ్యాంకు అప్పునకు తీసేసుకున్నారు. కొడుకేమో కూలి పనుల కోసం బెంగళూరు వెళ్లిపోయాడు. భార్య అనారోగ్యంతో చనిపోయింది. 70 ఏళ్ల వయసులో నడవలేకపోతున్నా. రోజూ పూట గడిచేదే కష్టంగా ఉంది. కాస్త పింఛను ఇప్పించి పుణ్యం కట్టుకోండి' అని అధికారులను వేడుకుంటున్నారు దూర్వాసులు నాయుడు. వడమాలపేట మండలం సీతారామపురానికి చెందిన ఈయన ఏడాదిగా అటు తహసీల్దారు.. ఇటు కలెక్టర్ ఆఫీసులకు తిరుగుతున్నారు. కానీ, పింఛను రాలేదు. ఇలా ఎందరో బాధితులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో గోడు వెళ్లగక్కారు.

8



రాష్ట్ర బడ్జెట్‌లో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు గణనీయంగా నిధుల కేటాయింపులు జరిగాయి. తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీ-నీవా తదితర సాగునీటి ప్రాజెక్టులకు రూ. 4530 కోట్లు దక్కాయి. దీంతో ఐదేళ్ళ తర్వాత సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో కదలిక రానుంది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు వివిధ కార్యక్రమాల కింద రూ. 350 కోట్లు కేటాయించిన ప్రభుత్వం రెండు జిల్లాల పరిధిలోని యూనివర్శిటీలు, శ్రీసిటీ ఐఐటీ సంస్థలకు రూ. 500 కోట్లు ఇచ్చింది. పులికాట్ పరిధిలో మత్స్యకారులు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న పూడికతీత పనులకు రూ. 97 కోట్లు మంజూరు చేసింది. చెన్నై-వైజాగ్ ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి పనులకు సైతం ప్రభుత్వం కొత్త బడ్జెట్‌లో రూ. 210 కోట్లు కేటాయించింది. గత ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం ఈ రెండు జిల్లాల పరిధిలో సాగునీటి, పారిశ్రామిక, విద్యా రంగాలకు నిధులేమీ కేటాయించని నేపథ్యంలో తాజాగా కూటమి ప్రభుత్వం జరిపిన నిధుల కేటాయింపులు రెండు జిల్లాల ప్రజలకు ఊరటనిస్తున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నిధులు ఘనం



చిత్తూరు,తిరుపతి జిల్లాలకు బడ్జెట్‌లో గణనీయంగా నిధుల కేటాయింపు

సాగునీటి ప్రాజెక్టుల పనుల్లో ఇక కదలిక



తెలుగు గంగ ప్రాజెక్టు పనులకు రూ. 879.24 కోట్లు

ఎన్టీయార్ తెలుగు గంగ ప్రాజెక్టుకు మొత్తంగా ప్రభుత్వం రూ. 879.24 కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు పనులకు గత వైసీపీ ప్రభుత్వం 2022-23లో రూ. 231.84 కోట్లు కేటాయించగా 2023-24లో రూ. 798.11 కోట్లు ప్రతిపాదించింది. అయితే బడ్జెట్ సవరణల్లో ఆ మొత్తాన్ని రూ. 619 కోట్లకు కుదించింది. ప్రస్తుత ప్రభుత్వం రూ. 879.24 కోట్లు కేటాయించినప్పటికీ అందులో సింహభాగం నెల్లూరు జిల్లా పరిధిలో ఖర్చు చేయనున్నారు. తిరుపతి జిల్లా విషయానికొస్తే అందులో సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ పనులకు రూ. 66 కోట్లు రానున్నాయి. ఈ కెనాల్ పనులకు గత ప్రభుత్వం 2022-23లో రూ. 10.17 కోట్లు కేటాయించింది. అలాగే 2023-24లో రూ.41.92 కోట్లు కేటాయించినప్పటికీ తర్వాత దాన్ని బడ్జెట్ సవరణల్లో రూ. 4.19 కోట్లకు కుదించింది. దీంతో ఈ కెనాల్ పనులేమీ జరగలేదు. తాజా కేటాయింపులతో పనులు తిరిగి మొదలు కానున్నాయి. అలాగే తాజా బడ్జెట్‌లో తెలుగు గంగకు కేటాయించిన నిధుల నుంచీ కండలేరు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్‌కు రూ. 11 కోట్లు దక్కనున్నాయి. ఈ స్కీమ్‌కు గతేడాది కూడా బడ్జెట్‌లో రూ. 11.54 కోట్లు కేటాయించారు.

హంద్రీ-నీవాకు రూ. 2014.23 కోట్లు



చిత్తూరు జిల్లాకు ప్రాణాధారంగా మారనున్న హంద్రీ-నీవా ప్రాజెక్టును గత ప్రభుత్వం ఐదేళ్ళూ విస్మరించగా కొత్త ప్రభుత్వం మొదటి బడ్జెట్‌లోనే గణనీయంగా నిధులు కేటాయించింది. వైసీపీ ప్రభుత్వం 2022-23లో రూ. 979.73 కోట్లు కేటాయించినా పనులేవీ చేపట్టలేదు. 2023-24లో తొలుత రూ.270.14 కోట్లు కేటాయించిన అప్పటి ప్రభుత్వం తర్వాత దాన్ని రూ. 486.37 కోట్లకు పెంచింది. అయినప్పటికీ ప్రాజెక్టు పనులు మాత్రం ముందుకు సాగలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన పనులు తప్ప ఈ ఐదేళ్ళలో కాలువ తవ్వకాలు గానీ, రిజర్వాయర్ల పనులు గానీ జరగలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో తంబళ్ళపల్లి, మదనపల్లె, పుంగనూరు, కుప్పం నియోజకవర్గాలకు హంద్రీ-నీవా జలాలందించిన చంద్రబాబు తాజా బడ్జెట్ కేటాయింపులతో ఈ పర్యాయం పీలేరు, పలమనేరు నియోజకవర్గాలకు నీరందించే అవకాశం కనిపిస్తోంది.

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ. 350 కోట్లు



తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌కు కొత్త బడ్జెట్‌లో రూ. 350 కోట్లు కేటాయించారు. తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద వివిధ అభివృద్ధి పనులకు రూ. 20 కోట్లు రానుండగా స్వచ్ఛ భారత్ మిషన్ కింద వాడిన నీటిని తిరిగి వినియోగించేలా మార్చేందుకు రూ. వంద కోట్లు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 16.17 కోట్లు, ఇతర ఖర్చులకు 6.50 కోట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు రూ. 75.94 కోట్లు, సామర్థ్యాల పెంపునకు రూ. 27.29 కోట్లు, సిబ్బంది వేతనాలకు రూ. 78.80 కోట్లు చొప్పున ఇతర నిధులు దక్కాయి. అలాగే నగరంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేయడానికి రూ. 25.58 కోట్లు కేటాయించారు.

గాలేరు నగరికి రూ. 2438.94 కోట్లు



దశాబ్దాలుగా జిల్లా ప్రజలను ఊరిస్తున్న గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు పనులకు కూటమి ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో రూ. 2438.94 కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుపై గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పనులు జరగని సంగతి తెలిసిందే. 2022-23లో నామమాత్రంగా రూ.275.48 కోట్లు కేటాయించినప్పటికీ పనులేమీ జరగలేదు. ఇక 2023-24లో రూ.855.34 కోట్లు తొలుత కేటాయించిన ప్రభుత్వం తర్వాత బడ్జెట్ సవరింపుల్లో దాన్ని రూ. 2072.86 కోట్లకు పెంచింది. నిధుల కేటాయింపును పెంచినా పనులు మాత్రం మొదలు కాలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో పనులు వేగంగా జరగగా వైసీపీ ప్రభుత్వం వచ్చాక అప్పటివరకూ అమల్లో వున్న టెండర్లను రద్దు చేయడంతో పాటు ఏకంగా ప్రాజెక్టు డిజైన్‌ను కూడా మార్చివేసింది. శేషాచల అడవుల్లో టన్నెల్ నిర్మాణానికి బదులు గండికోట రిజర్వాయర్ నుంచీ కాలువ తవ్వి నీటిని తంబళ్ళపల్లి, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాల మీదుగా తూర్పు ప్రాంతానికి తరలించేలా ప్రణాళికను మార్చింది.కానీ దానికి నిధులేవీ కేటాయించలేదు. ఇపుడు కూటమి ప్రభుత్వం తొలి ఏడాది బడ్జెట్‌లోనే ఏకంగా రూ. 2438 కోట్లు కేటాయించడంతో మునుపటి డిజైన్ ప్రకారమే పనులు సజావుగా సాగుతాయని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

ఉన్నత విద్యా సంస్థలకు రూ. 500 కోట్లు



జిల్లాలో ఉన్నత విద్యా సంస్థలకు కొత్త ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించింది. ఎస్వీయూకు తాజా బడ్జెట్‌లో రూ. 226.38 కోట్లు కేటాయించగా ఈ వర్శిటీకి 2022-23లో 263 కోట్లు, 2023-24లో రూ. 211.83 కోట్లు చొప్పున వచ్చాయి. ఎస్వీ వెటర్నరీ వర్శిటీకి గతేడాది రూ. 127.85 కోట్లు దక్కగా ఈ పర్యాయం రూ. 153 కోట్లు కేటాయించారు. ఇక పద్మావతీ మహిళా వర్శిటీకి రూ. 72.73 కోట్లు ఈ బడ్జెట్‌లో దక్కగా ఇదే వర్శిటీకి 2022-23లో 52.22 కోట్లు, 2023-24లో రూ. 51.74 కోట్లు వంతున నిధుల కేటాయింపులు జరిగాయి. కుప్పంలోని ద్రవిడ యూనివర్శిటీకి తాజా బడ్జెట్‌లో రూ. 27.91 కోట్లు కేటాయించారు. ఈ వర్శిటీకి 2022-23లో రూ. 18.48 కోట్లు, 2023-24లో రూ. 23.17 కోట్లు వంతున నిధుల కేటాయింపులు జరిగాయి.శ్రీసిటీలో కొత్తగా ఏర్పాటవుతున్న ఐఐటీకి కూటమి ప్రభుత్వం రూ. 19.52 కోట్లు కేటాయించింది. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన దశలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తొలి బడ్జెట్‌లో జరిపిన కేటాయింపులు తిరుపతి, చిత్తూరు జిల్లాల అభివృద్ధికి మేలు చేస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

పులికాట్‌కు పునఃవైభవం

- పూడికతీతకు 97కోట్లు కేటాయింపు

తడ/వాకాడు, ఆంధ్రజ్యోతి: పులికాట్ మత్స్యకారుల చిరకాల కోరిక నేరవేరనుంది. బడ్జెట్‌లో పులికాట్ పూడిక తీతకు రూ.97 కోట్లు కేటాయించడంతో మత్స్యకారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. పులికాట్ సరస్సు ముఖద్వారాలు మూడు దశాబ్దాలకు ముందే పూడుకుపోయాయి. అప్పట్నుంచి మత్స్యకారుల జీవనం గగనంగా మారింది. ప్రభుత్వాలు మారుతున్నా పూడికతీతను పట్టించుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్ల పాటు పట్టించుకోకుండా.. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో అంటే గతేడాది నవంబరులో పూడికతీత పనులకు శంకుస్థాపన చేస్తున్నామంటూ హడావుడి చేసింది. అప్పటి సీఎం జగన్ తడ మండలం మాంబట్టులో శంకుస్థాపనకు సిద్ధం కాగా వరుణుడు అడ్డురావడంతో వాయిదాపడింది. ఆ తరువాత దీనిని పక్కన పెట్టేసింది. ఎన్నికల సమయంలో పూడికతీతపై టీడీపీ హామీనిచ్చింది. ఆమేరకు కేంద్ర ప్రభుత్వంతో కలసి సంయుక్తంగా రూ.97 కోట్లతో వాకాడు మండలం పూడిరాయదొరువు వద్ద పూడికతీతకు సిద్ధమైంది. ఆమేరకు బడ్జెట్‌లో ఆ ప్రతిపాదనలు పెట్టడంపై సూళ్లూరుపేట, గూడూరు ఎమ్మెల్యేలు నెలవల విజయశ్రీ, పాశిం సునీల్‌కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ ప్రకటన విడుదల చేశారు. రెండు నియోజకవర్గాలలోని ద్వారా సుమారు 20వేల మంది మత్స్యకారులకు మంచి రోజులు రానున్నాయన్నారు.



పూడిరాయదొరువు వద్ద సముద్ర ముఖద్వారం

బడ్జెట్‌పై నేతల మాట - 8లో

అదంతా కట్టుకథే

- తల్లితండ్రులకు భయపడి బాలికే 'దాడి' నాటకమాడింది
- ఎర్రావారిపాళెం మండల ఘటనపై ఎస్పీ సుబ్బరాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ఎర్రావారిపాళెం మండలంలోని బాలికపై అత్యాచారం జరగలేదు. దాడి కూడా తల్లిదండ్రులకు భయపడి ఆ బాలిక అల్లిన కట్టు కథే' అని ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టంచేశారు. తిరుపతిలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసుకు సంబంధించి బాలుడ్ని జువైనల్ హోంకు తరలించామన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపినట్లు చెప్పారు. 'బాలుడు, బాలికది ఒకే ఊరు. ఒకే స్కూలులో ఒకే తరగతి చదువుతున్నారు. ఈ నెల 4న సాయంత్రం వారిద్దరూ కలసి ముందుగానే అనుకున్న ప్రకారం మాట్లాడుకోవడానికి వెళ్లడంతో ఇంటికి వెళ్లడం ఆలస్యమైంది. దీంతో ఆ బాలిక తల్లిదండ్రులు రెండుసార్లు ఆమెకోసం వెదికి స్కూలు వద్దకు వచ్చారు. వారికి భయపడి ఆ బాలిక చేతిలో ఉన్న గాజులతో గీసుకుని గాయాలు చేసుకుంది తప్ప అత్యాచారం జరగలేదని వైద్య పరీక్షలు, పోలీసులు దర్యాప్తులో తేలింది. బాలికకు సంబంధించి రక్త పరీక్షలు, ఇతర అన్ని రకాల పరీక్షలు జరిపి డాక్టర్ల నుంచి రిపోర్టు తెప్పించుకున్న తర్వాత బాలికపై అత్యాచారం జరగలేదని నిర్ధారణకు వచ్చాం. కానీ బాలిక చేసిన తప్పును కప్పి పుచ్చుకోవడానికి పథకం ప్రకారం తనపై గుర్తు తెలియని వ్యక్తులు ముసుగు వేసుకుని ఒక మోటారు సైకిల్‌పై వచ్చి దాడి చేశారని తల్లి దండ్రులతో చెప్పింది' అని ఎస్పీ వివరించారు. సంఘటన జరిగిన రోజున ఎర్రావారిపాలెం ఎస్ఐ, మహిళా కానిస్టేబుల్, భాకరాపేట సీఐ అక్కడకు చేరుకుని మెరుగైన చికిత్స నిమిత్తం బాలికను తిరుపతి ప్రసూతి ఆస్పత్రికి తరలించారని గుర్తుచేశారు. అప్పటికప్పుడే అవసరమైన పరీక్షలు చేశారన్నారు. మహిళా డీఎస్పీ, తహసిల్దార్, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు, బాలిక తల్లి తండ్రుల సమక్షంలో బాలికను విచారించి, వాగ్మూలం నమోదు చేశామన్నారు. తనతో పాటు చదువుతున్న ఆ బాలుడ్ని కాపాడాలనే ఉద్దేశంతో ఆ బాలిక కట్టుకథ అల్లినట్లు విచారణలో తేలిందన్నారు. బాలిక ఇచ్చిన స్టేట్‌మెంటు ప్రకారం ఆ బాలుడ్ని అదుపులోకి తీసుకుని జువైనల్ హోంకు తరలించామని ఎస్పీ చెప్పారు. ఇటువంటి ఘటనలపై వాస్తవాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాలో అత్యాచారం అంటూ కల్పిత వార్తలు ప్రచురించినా, ప్రచారం చేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎర్రావారిపాళెం బాలిక ఘటనపై దుష్ప్రచారం చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, వెంకట్రావు, చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐలు పాల్గొన్నారు.

చట్టపరిధిలోనే పనిచేస్తున్నా

నేను రాజకీయాల గురించి మాట్లాడను. ఎవరెన్ని ఆరోపించినా చట్టపరిధిలోనే పనిచేస్తున్నా. నేనూ ఏపీకి చెందిన అధికారినే. మాది అనంతపురం జిల్లా. స్వామి వారి సన్నిధిలో పనిచేసే భాగ్యం లభించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. తిరుపతిలో పనిచేయాలని నాకు చాలా కోరిక ఉండేది. జిల్లా ఎస్పీగా పోస్టింగ్ తీసుకుని వచ్చి అంకితభావం, అకుంఠిత దీక్ష, క్రమశిక్షణతో పనిచేస్తున్నా. నాకు తప్పు చేయాల్సిన అవసరం లేదు. ఎప్పుడూ చట్టపరిధిలోనే పనిచేస్తా.

- సుబ్బరాయుడు, తిరుపతి ఎస్పీ

ఇసుక లారీ సీజ్

చంద్రగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం గాదంకి టోల్ ప్లాజా వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న లారీని సోమవారం పోలీసులు సీజ్ చేశారు. టోల్‌ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా.. తిరుపతి నుంచి చిత్తూరువైపు ఇసుకపై పట్ట కట్టుకుని కర్ణాటకకు వెళుతున్న లారీని ఆపారు. పట్టను తొలగించి చూడగా ఇసుక ఉంది. అప్పటికే లారీ డ్రైవర్, క్లీనర్ పరారయ్యారు. లారీని సీజ్ చేసి చంద్రగిరి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

లక్ష్యం కోసం పట్టుదలతో చదవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ యాసిన్

చంద్రగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చిన్నప్పుడే లక్ష్యాలను ఏర్పరుచుకుని పట్టుదలతో చదివి విజయం సాధించాలని అమర హాస్పిటల్ ఎమెర్జెన్సీ ఫిజీషియన్ డాక్టర్ యాసిన్ అన్నారు. ఏపీ ఉమెన్స్ డ్రైవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం చంద్రగిరిలోని రాయల్ విక్టరీ స్కూల్లో విద్యార్థులకు ఉన్నత చదువులు, ఉద్యోగ ఎంపికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ యాసిన్ మాట్లాడుతూ డాక్టర్ అబ్దుల్ కలాం చెప్పినట్లుగా కలలు కనాలని, ఆకలలు సాకారం అయ్యేంతవరకు నిరంతరం శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ కో-ఫౌండర్ వడ్లమూడి రాధ, డైరెక్టర్లు అశ్వనీరెడ్డి, పావని, వనిత, స్కూల్ చైర్మన్ ప్రసాద్, పాల్గొన్నారు.

బెల్టు షాపులపై దాడులు

- ముగురి అరెస్ట్
- 199 మద్యం బాటిళ్ల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో అధికారులు

చంద్రగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి, ఎర్రావారిపాళెం మండలాల్లో బెల్టు షాపులపై ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురి అరెస్ట్ చేశారు. 199 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చంద్రగిరి ఎక్సైజ్ సీఐ ఫణీంద్ర కథనం మేరకు.. చంద్రగిరి, ఎర్రావారిపాళెం మండలాల్లో మద్యం బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో చంద్రగిరి మండలం పిచ్చినాయుడుపల్లెకు చెందిన కళత్తూరు రాము నుంచి 32 మద్యం బాటిళ్లను, ఎర్రావారిపాళెం మండలం మట్లోళ్లపల్లిలో శోభా నుంచి 5 బీరు బాటిళ్లు, 8 మద్యం బాటిళ్లను, ముసలి సుబ్బారెడ్డి వద్ద 142 మద్యం బాటిళ్లను, 12 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిని అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో సీఐ ఫణీంద్ర, ఎస్ఐలు సుధాకర్‌రావు, గిరి, ఎన్ఫోర్స్‌మెంట్ సీఐ జవహర్‌బాబు, ఎస్ఐ పృథ్వీ, సిబ్బంది కృష్ణయ్య పాల్గొన్నారు.

సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడులు



మామిడి పూతను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శివకుమారి

భాకరాపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సమగ్ర సస్యరక్షణతో మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చునని చిన్నగొట్టిగల్లు ఉద్యాన శాఖ అధికారి శివకుమారి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం, చట్టివారిపాళెం వద్ద మామిడి తోటలను ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూత దశలో తేనెమంచు పురుగులు, పూతగూడు పురుగులు, పక్షి కన్ను తెగుళ్ల ఎక్కువగా వస్తాయన్నారు. దీని నివారణకు ఆసిఫేట్ ఐదు గ్రాములు, టే ఫ్లుబెంజురాన్ ఐదు మిల్లీలు, కార్బన్డిజం ఒక గ్రామం, లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పూత రావడానికి మల్టీకే 10 గ్రాములు, బోరాన్ ఒక గ్రాము, యూరియా, ఐదు గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యం



ఆకుకూరలు అందజేస్తున్న ఎంపీడీవో ఇందిర

రామచంద్రాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పంటలు ఆరోగ్యకరమని ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం షణ్ముగం అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేసిన కూర గాయల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఇందిర మాట్లాడుతూ మండలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేసిన కూరగాయలు, ఆకు కూరలను విక్రయించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మజ్దూర్ యూనియన్‌కు మద్దతు ఇవ్వండి



రైల్వే ఉద్యోగులతో మాట్లాడుతున్న శంకర్ రావు

తిరుపతి(సెంట్రల్)నవంబరు11(ఆంధ్రజ్యోతి): భారత రైల్వేలో ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే మజ్దూర్ యూనియన్‌కు ఓటు వేయాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ సీహెచ్ శంకర్‌రావు విజ్ఞప్తిచేశారు. భారత రైల్వేలో డిసెంబరు 4, 5, 6 తేదీల్లో జరగనున్న ఉద్యోగ సంఘాల గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం తిరుపతి రైల్వే స్టేషన్‌లోని కోచింగ్ డిపో వద్ద కార్మికులతో ఆయన మాట్లాడారు. స్టేషన్ పరిధిలోని అన్ని విభాగాల్లో వున్న ఉద్యోగులు, కార్మికులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుంతకల్లు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.సుదర్శన్ రాజు, విజయకుమార్, స్థానిక నాయకులు రవీంద్ర నాయక్, మునిరత్నం, నారాయణ, రేణిగుంట శాఖ నాయకులు నరేష్, సురేష్‌కుమార్, ఏఆర్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వికలాంగ దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించాలని పీడబ్ల్యూడీ ఫెడరేషన్ రాష్ట్రకార్యదర్శి సుబ్ర హ్మణ్యంతో పాటు మరికొందరు దివ్యాంగులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో ఉన్న దివ్యాంగుల కార్యాలయానికి అధికారులు చుట్టపుచూపుగా వస్తున్నారని ఎప్పుడూ అధికారులు అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి వచ్చే సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలన్నారు.

శ్రీవారికి నిస్వార్థంగా సేవలందిస్తా



పురందేశ్వరికి ప్రసాదాలు అందజేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధిష్ఠానం తనకు అప్పగించిన బాధ్యతల ప్రకారం శ్రీవారు, భక్తులకు నిస్వార్థంగా సేవలందిస్తానని టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి చెప్పారు. ఆయన సోమవారం రాత్రి విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌లను కలిసి తనకు టీటీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. శ్రీవారి దర్శనానికి రావాలని ఆహ్వానించారు.

శాస్త్రోక్తంగా మృత్యుంజయుడికి అభిషేకం

శ్రీకాళహస్తి, నవం బరు 11 (ఆంధ్ర జ్యోతి): శ్రీకాళ హస్తీశ్వరాల యంలో కొలువై ఉన్న మృత్యుంజయ స్వామికి సోమవారం శాస్త్రో క్తంగా అభిషేకం నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంలో అభిషేకించారు. అనంతరం వివిధ పుష్పాలతో, గజమాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

టీటీడీ విద్యుత్ విభాగంలో ఆయుధపూజ

తిరుమల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని గోగర్భం డ్యాం వద్ద టీటీడీ విద్యుత్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆయుధపూజ ఘనంగా నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి పూజలు నిర్వహించారు. సబ్‌స్టేషన్‌కు, ట్రాన్స్‌ఫార్మర్లకు, ఇతర విద్యుత్ పరికరాలకు పూజలు చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఆశాజ్యోతి, డీఈ చంద్రశేఖర్, డిప్యూటీ ఇంజినీర్ వాణి, ఏఈ గోపీనాథ్, ఇతర డిప్యూటీ ఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

11టీటీడీ1- కార్తీక్‌రాజు

శ్రీవారిసేవలో సినీనటుడు కార్తీక్‌రాజు

తిరుమల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): సినీనటుడు కార్తీక్‌రాజు సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది ప్రసాదాలు అందజేశారు.

శ్రీవారి ఆదాయం రూ.3.45 కోట్లు

తిరుమల, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి కి హుండీ ఆదాయం రూ.3.79 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించింది. ఈ మేరకు రూ.3.45 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక ఆదివారం 82,233 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,415 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

జలకంఠేశ్వరుడికి తిరుమంజనం

రామచంద్రాపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక సోమవారం సందర్భంగా రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరస్వామివారికి సోమవారం తిరుమంజనం జరిగింది. విశేష పూజల అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉభయదాతలు రామాపురం సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి, కుప్పంబాదూరు ఎంపీటీసీ కృష్ణవేణి దంపతులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక వన భోజనం



పూజలు చేస్తున్న భక్తజనమండలి సభ్యులు

రామచంద్రాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి భజనమండలి కళాకారులు రామాపురం వద్ద ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణంలో సోమవారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఉసిరిచెట్టు కింద కార్తీక పూజలు చేశారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భజన మండలి అధ్యక్షులు గుండాల గోపీనాథ్, వాసుదేవరెడ్డి, పులిగోరు ప్రభాకర్‌రెడ్డి, రవి ప్రసాద్, నాగేశ్వరరావు, చెంగారెడ్డి, జయమ్మ, ధనమ్మ పాల్గొన్నారు.

శిల్పారామంలో కార్తీకమాసం సదుపాయాలు

తిరుచానూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో కార్తీక మాసం పురస్కరించుకుని వనభోజనాలు చేయాలనుకునే సందర్శకులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నట్లు పరిపాలన అధికారి ఖాదర్‌వల్లి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉచిత తాగునీరు. కూర్చోవడానికి కుర్చీలు, ఉసిరిచెట్టు వద్ద పూజలు చేసుకునే సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. ఈ సదుపాయాలు బృందాలుగా వచ్చే సందర్శకులకు మాత్రమేనని స్పష్టం చేశారు. కేవలం ప్రవేశరుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 8886652044, 8886652016 ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్

భాకరాపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని చిన్నగొట్టిగల్లు క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం లంకిపల్లివారి పల్లిలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు సురేందర్ నాయుడు, బెల్లంకొండ రమణ, చోటసాహెబ్, రాజగోపాల్ నాయుడు, కాకి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు ప్రారంభం





విభూది అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి, విశేష అంలకరణలో ఆనందవల్లీదేవి, విభూది, గంధం అలంకరణలో మల్లేశ్వరస్వామి

చంద్రగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తొండవాడ స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం 5 గంటలకు స్వామి అమ్మవార్లకు అభిషేకం చేసి, 7 గంటలకు అగస్త్యేశ్వరస్వామికి విభూది అభిషేకం, అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్తీక మాసం రెండవ సోమవారం కావడంతో భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. దీపారాధనలు చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలకు శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి భక్తులు పాల్గొన్నారు. ● చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో స్వామివారికి అభిషేకం చేసి, ఉదయం విభూది, సాయంత్రం గంధం అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ శైవాంగ పండితులు శివకుమార్ శర్మ, ఆలయ కమిటీ పాల్గొన్నారు.

149 గ్రాముల బంగారం, కేజీ వెండి చోరీ



చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు (ఇన్‌సెట్లో) విరిచేసిన తలుపు చిలుకు



చంద్రగిరి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలోని ప్రశాంతినగర్‌లో ఓ ఇంట్లో భారీ చోరీ జరిగింది. ఈ చోరీలో 149 గ్రాముల బంగారు, కిలో వెండి, రూ.15 వేల నగదును గుర్తు తెలియని దుండగులు చోరీ చేశారు. పోలీ సుల కథనం మేరకు.. ప్రశాంతినగర్‌లో వెంకటరమణ, ప్రసన్నలక్ష్మి దంపతులు నివస్తున్నారు. వీరిద్దరూ టీచర్లు. వీరి పెద్దకుమారుడు సాయితేజ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. చిన్న కుమారుడు చక్ర ధరసాయి ఒడిశా లోని ఎన్టీపీసీలో పని చేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన దంపతులు ఇద్దరూ చిన్నకుమారుడు వద్దకు వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటి పనిమనిషి వచ్చి చూడగా, ఇంటి గేటు తాళాలు పగిలి పోయి ఉన్నాయి. తలుపులు తెరిచి ఉన్నాయి. చోరీ జరిగిందని తెలుసుకుని పెద్దకుమారుడు సాయితేజకు సమాచారం ఇచ్చింది. సాయితేజ వచ్చి చూడగా కబోర్డు తాళాలు పగిలిపోయి ఉన్నాయి. లాకర్ తెరిచి ఉంది. 10 గ్రాముల బంగారు పగడాల దండ, 30 గ్రాముల మూడు బంగారు గాజులు, 10 గ్రాముల ఎర్రపూసల చైను, 10 గ్రాముల బంగారు ముత్యాల దండ, 15 గ్రాముల బంగారు డాలర్ చైను, 8 గ్రాముల బంగారు లక్ష్మీ కాసులు, జత కమ్మలు, 12 గ్రాముల బంగారు చైను, నల్లపూసల దండ చోరీకి గురయ్యాయి. మొత్తంగా రూ.13 లక్షల విలువైన 149 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగలు దోచుకెళ్లారు. అలాగే కేజీ బరువుగల వెండి చెంబు, ఇతర వెండి వస్తువులు, రూ.15 వేల నగదు చోరీకి గురైంది. సాయితేజ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. వేలిముద్రలు సేకరించారు. కేసు నమోదు చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పాకాలలో అవగాహన కల్పిస్తున్న సీఐ మద్దయ్య ఆచారి

పాకాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ మద్దయ్య ఆచారి పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో సోమవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా విద్యా ర్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్, అత్యాచారాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మద్దయ్య ఆచారి, ఎస్ఐ వెంకట్రామానాయుడు మాట్లాడుతూ సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని, ఫొటోలను ఉంచరాదని సూచించారు. విద్యార్థినులు మొబైల్ ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లకు సమాధానాలు ఇవ్వరాదని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, ఎన్ఎస్ఎస్ పీవో మునిరాజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

భాకరాపేట: భాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర పాల్గొన్నారు.

ఆవు రూపంలో వచ్చిన మృత్యువు

- అదుపుతప్పిన ద్విచక్ర వాహనం
- భార్య మృతి, భర్తకు తీవ్రగాయాలు



మృతి చెందిన కమలమ్మ

రామచంద్రాపురం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-పచ్చికాపల్లం రహదారి గంగమాంబపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్య మృతిచెందింది. భర్తకు తీవ్ర గాయాలయ్యాయి. వెదురుకుప్పం మండలం గుంతలచేను గ్రామానికి చెందిన కమలమ్మ(26), సుబ్రహ్మణ్యంరెడ్డి(35) తిరుపతిలోని ఓ మెడికల్ దుకాణంలో పనిచేస్తూ అక్కడే కాపురం ఉంటున్నారు. ఆదివారం సెలవుకావడంతో స్వగ్రామానికి వెళ్లారు. సోమవారం విధులకు ద్విచక్ర వాహనంలో తిరుపతికి తిరుగు ప్రయాణం అయ్యారు. గంగమాంబ పురం వద్దకు రాగానే ఓ ఆవు అకస్మాత్తుగా రోడ్డుపై ఎదురుగా వచ్చింది. దాన్ని తప్పించబోయి సడన్ బ్రేక్ వేయడంతో వాహనం అదుపు తప్పింది. దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో కమలమ్మ మృతి చెందింది. సుబ్రహ్మణ్యంరెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆర్‌సీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్త జన సంద్రం ముక్కంటి ఆలయం



శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆదివారం నుంచే ఆలయంలో రద్దీ కొనసాగింది. ఆదివారం రాత్రి భక్తుల తాకిడితో పట్టణంలోని అతిథిగృహాలన్నీ నిండిపోయాయి. ఈ క్రమంలో సోమవారం వేకువజామున భక్తులు స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 37 వేల మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తు న్నారు. రూ.50 దర్శనం టిక్కెట్లు 2,937, రూ.200 శీఘ్రదర్శనం 2,977 అమ్ముడైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తంగా శివనామ స్మరణలో ముక్కంటి ఆలయం మార్మోగింది.

సచివాలయ ఏఎన్‌ఎంలకు అదనపు పనిభారం తగ్గించండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీ హంస నేతలు

తిరుపతి(వైద్యం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సచివాలయంలోని ఏఎన్‌ఎంలపై అదనపు పనిభారం తగ్గించాలని ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా మున్సిపల్ కమిషనర్ మౌర్యను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రాజా ఆధ్వర్యంలో సచివాలయం ఏఎన్‌ఎంలు ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయంలో విధులు కాకుండా ఇతర శాఖల పనులు అప్పగిస్తున్నారని పేర్కొన్నారు. స్పందించిన ఆమె వేరే శాఖల విధులు కేటాయించరాదని అధికారులను ఆదేశించారు. దీంతో వారు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస కోశాధికారి ఇమ్రాన్, నేతలు ముకేష్, జ్యోతిలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు మహాలక్ష్మి, కల్పన కుమారి, ప్రభావతి, షాలిని, రూపారాణి తదితరులు పాల్గొన్నారు.

జపాన్ విద్యాసంస్థతో ఎస్వీయూ ఎంవోయూ

- నేడు అమరావతికి అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జపాన్‌లోని ఓ ప్రముఖ విద్యాసంస్థతో ఎస్వీయూనివర్సిటీ అవగాహనా ఒప్పందాన్ని చేసుకోనుంది. దీనికి సంబంధించిన సమావేశం మంగళవారం అమరావతిలో జరగనుంది. రాష్ట్రంలోని 18 విశ్వవిద్యాలయాలకు గాను 6 యూనివర్సిటీల అధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ఎస్వీయూ, పద్మావతి యూనివర్సిటీ ఉన్నతాధికారులు వెళ్లనున్నారు. ఈ ఎంవోయూ ద్వారా బోధన, పరిశోధన, విస్తరణ అంశాల్లో జపాన్, ఎస్వీయూ, పద్మావతి వర్సిటీలు పరస్పరం సహకరించుకోనున్నాయి. కొత్త కోర్సులు, నూతన పరిశోధనలకు అవకాశం ఏర్పడుతుందని ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పేర్కొన్నారు.

సెట్విన్ సీఈవోగా మోహన్‌కుమార్

తిరుపతి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): యువజన సర్వీసుల శాఖ తిరుపతి సీఈవోగా కె.మోహన్‌కుమార్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఉన్న మురళీకృష్ణ మాతృసంస్థకు బదిలీ అయిన విషయం తెలిసిందే. యువజన సర్వీసులశాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు కలెక్టర్ వెంకటేశ్వర్ సెట్విన్ మేనేజర్‌గా ఉన్న మోహన్‌కుమార్‌కు సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన బాధ్యతలు కూడా తీసుకున్నారు.

అపార్ నమోదు వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అపార్ నమోదును వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఈవో, ఎంపీడీవో తదితరులతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జాతీయ నూతన విద్యావిధానం-2020లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం, ఒకే విద్యార్థి పేరుతో విద్యార్థులకు ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమీ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్) నమోదును ప్రవేశపెట్టిందన్నారు. దీనివల్ల విద్యార్థులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని తెలిపారు. నమోదును నిర్దేశించిన గడువు లోపు పూర్తి చేయాలన్నారు.

ఈఎస్ సు'గుణం'



తిరుపతి (నేరవిభాగం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేవీబీపురానికి చెందిన చెంగారెడ్డి దంపతులు భూ సమస్యపై వినతిపత్రం ఇవ్వడానికి గ్రామస్తులతో కలిసి సోమవారం కలెక్టరేట్‌కు వచ్చాడు. ఆలస్యంగా రావడంతో అప్పటికే గ్రామస్తులు కలెక్టర్ చాంబర్ వద్దకు వెళ్లిపోయారు. వారు ఎక్కడ ఉన్నారో తెలియక తికమకపడుతున్నారు. ఈ క్రమంలో ఈఎస్ (ఎక్సైజ్ సూపరింటెండెంట్) నాగమల్లేశ్వర రెడ్డి అటుగా వచ్చారు. 'సార్...మా ఊరి వాళ్లు ఎక్కడ ఉన్నారో తెలియడం లేదు.. ఫోన్ చేసి మమ్మల్ని వారి వద్దకు పంపండి అని కోరారు. ఈఎస్ ఫోన్ చేసి వారిని స్వయంగా తీసుకెళ్లి వదిలి వెళ్లారు.

జీవలింగేశ్వరాలయంలో కార్తీక సోమవార పూజలు



వ్రతమాచరిస్తున్న మహిళలు

తిరుపతి (జీవకోన), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీవకోనలో వెలసిన జీవలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవార పూజలు నిర్వహించారు. ముందుగా స్వామికి నిత్య కైంకర్యాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పూజారి మహిళలతో వ్రతాన్ని ఆచరింపజేశారు. మహిళలు పెద్దయెత్తున పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు వస్తువుల వితరణ



విద్యార్థినులతో దాత లలితచంద్ర

తిరుపతి (జీవకోన), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని జీవకోనలో రియల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేతాజీ సుభాష్ చంద్రబోస్ బాలికల వసతిగృహ విద్యార్థినులకు దాత బి.లలిత చంద్ర రూ.86 వేలు విలువైన రెండు కంప్యూటర్లు, 8 స్టడీ చైర్లు, రెండు గీజర్లు, స్టడీ మెటీరియల్స్, నిత్యావసర సరుకులు, డ్రాయింగ్ షీట్లు, క్రీడా పరికరాలు అందజేశారు. మధ్యాహ్నం భోజనం సమకూర్చారు. ఆమెకు నిర్వాహకులు సాకం కృష్ణమూర్తి, వార్డెన్ హేమావతి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అకౌంటెంట్ శైలజ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తిగా వీధిలైట్ల ఏర్పాటు



డివైడర్ మధ్యలో ప్రమాదకరంగా కేబుల్స్

తిరుపతి అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కరకంబాడి రోడ్డులో వీధిలైట్ల ఏర్పాటు అసంపూర్తిగా ఉంది. మంగళం పరిధిలోని వేంకటేశ్వరకాలనీ నుంచి వెంకటాపురం వరకు వాహనదారుల సౌకర్యార్థం ఎన్నికలకు ముందు టీటీడీ వీధిలైట్ల ఏర్పాటు పనులను ప్రారంభించింది. గ్రౌండ్ వర్క్ పూర్తి చేసింది. స్తంభాల ఏర్పాటు, విద్యుత్ కనెక్షన్లు వంటి పనులు చేపట్టలేదు. డివైడర్ మధ్యలో ఏర్పాటు చేసిన కేబుల్స్ రోడ్డుమీదుగా గాల్లో వేలాడుతున్నాయి. డివైడర్‌కు దగ్గరగా వెళ్లే వాహనదారులకు ఇవి తగులుకునే ప్రమాదముంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే ఈ పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

చాంద్‌బాషాను కఠినంగా శిక్షించాలి

తిరుపతి (లీలామహల్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణులను కులం పేరుతో దూషించిన కడప ముస్లిం మైనార్టీ నేత చాంద్‌బాషాను కఠినంగా శిక్షించాలని నాయీ బ్రాహ్మణ సంఘం తిరుపతి నగర అధ్యక్షుడు శిబ్యాల సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి శుభకార్యంలోనూ ముందుండే బ్రాహ్మణులను కించపరిచేలా మాట్లాడటం బాధాకరమన్నారు. ఇకపై ఇలాంటివి జరిగితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వంలో తమకు ప్రాధాన్యత ఇస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని తిరుపతి రూరల్ ఎక్సైజ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతని నుంచి 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎక్సైజ్ సీఐ నరసనాయుడు వివరాల మేరకు...తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట హరిజనవాడకు చెందిన వెంకటసుబ్బయ్య కొన్ని రోజులుగా మద్యం దుకాణాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి, ఇంటి వద్ద అధిక ధరకు విక్రయిస్తున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ కవీశ్వర నాయుడు సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వెంకటసుబ్బయ్యను అరెస్టు చేశారు.

మోటారు సైకిళ్ల దొంగ అరెస్టు
నాలుగు బైక్‌ల స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితుడు

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిళ్లను దొంగిలించే వ్యక్తిని తిరుపతి రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతని నుంచి రూ.2.50 లక్షల విలువ చేసే నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. తుమ్మలగుంట హరిజనవాడకు చెందిన కొణిదల తేజ ఇళ్ల ముందు, పార్కింగ్ ప్రదేశాల్లో ఆపి ఉన్న మోటారు సైకిళ్లు దొంగిలించి స్నేహితులు వంశీ, దుర్గాప్రసాద్‌లకు విక్రయించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు తేజను సోమవారం వైకుంఠపురం ఆర్చి సమీపంలో అరెస్టు చేశారు.

ఇద్దరు దొంగల అరెస్టు
25 గ్రాముల బంగారు నగలు స్వాధీనం



ఇంటి దొంగలను అరెస్టు చేసిన పోలీసులు

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతితో పాటు పలు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన ఇద్దరు దొంగలను తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. వారి నుంచి 25 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నారు. ఈస్ట్ ఎస్ఐ నరసింహులు కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం సేలానికి చెందిన శశికుమార్, సురేష్ తిరుపతిలో దొంగతనాలకు పాల్పడేవారు. ఇప్పటికే చాలా ప్రాంతాల్లో వీరిపై కేసులున్నాయి. ఈ క్రమంలో గత అక్టోబరు 5న బైరాగిపట్టెడలో ఒంటరిగా కాపురమున్న వృద్ధురాలు ఇంట్లో నిద్రిస్తుండగా ఆమె మెడలో వున్న దాదాపు 25 గ్రాముల మంగళ సూత్రాన్ని తెంచుకుని పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నిందితులు ఆర్టీసీ బస్టాండు వద్ద ఉండగా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చందనాలంకరణలో మల్లికార్జునస్వామి



తిరుపతిరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఎల్ఎస్ నగర్‌లోని భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో కార్తీక మాస రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారు సోమవారం చందనాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, స్వర్ణ పాలాభిషేకం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం చందనాభిషేకం నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు చెంగారెడ్డి, ఉమాపతిరెడ్డి, మేనేజర్ లీలాప్రకాశ్, అర్చకులు దివాకర్‌స్వామి, ధరేంద్రస్వామి, వంశీస్వామి పాల్గొన్నారు.

సమస్యల చదువులు
మంగళం ట్రెండ్స్ పాఠశాలలో వసతుల లేమి
మచ్చుకైనా కానరాని పారిశుధ్యం



ఆకులతో నిండిన పాఠశాల స్లాబు

తిరుపతి అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య లోపం, వసతుల లేమికి మంగళం ట్రెండ్స్ పాఠశాల చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది. ఆంధ్రజ్యోతి క్షేత్ర పర్యటనలో ఈ విషయం వెల్లడైంది. తిరుపతి శివారు ప్రాంతమైన మంగళం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక ట్రెండ్స్ పాఠశాలలో దాదాపు వెయ్యిమందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. తరగతి గదులు శుభ్రం చేయడం లేదు. గోడలు బూజుపట్టి ఉన్నాయి. బెంచ్‌లు విరిగిపోయి ఉన్నాయి. ఫ్యాన్లు తిరగడం లేదు. ట్యూబ్‌లైట్లు వెలగడం లేదు. బ్లాక్‌బోర్డ్స్ రంగుతేలి ఉన్నాయి. వాష్‌బేసిన్స్ అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. మరుగుదొడ్లు, టాయిలెట్లు ధ్వంసమై ఉన్నాయి. వాటర్‌పైపులు, తలుపులు విరిగిపోయి ఉన్నాయి. బాత్‌రూమ్‌లలో నీరు వృథాగా పోతోంది. వంటశాలలోనే పుస్తకాలు, అట్టపెట్టెలు నిల్వ ఉంచారు. పాఠశాల ఆవరణ ఎండుటాకులు, చిత్తు కాగితాలు, ఆహారపదార్థాల వ్యర్థాలతో నిండిపోయి ఉంది. ఇలా ఎటు చూసినా అపరిశుభ్రత స్పష్టంగా కనిపిస్తోంది. ఉపాధ్యాయులు వినియోగించే గదులు, టాయిలెట్స్ మాత్రం శుభ్రంగా ఉన్నాయి. ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.







మంచినీటి కుళాయిల వద్ద దుర్వాసన వెదజల్లుతున్న మురుగు - స్టోరు రూమ్‌గా మారిన వంట గది - అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు

జగన్ తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరు : టీడీపీ



ఏఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న బాలసుబ్రమణ్యం తదితరులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తేలేదని, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడిని ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే చూస్తూ ఊరుకోబోమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం స్పష్టం చేశారు. అధికారం పోయిందనే అక్కసుతో ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్న జగన్‌పై తక్షణం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రైల్వేస్టేషన్‌లోని ఆటోడ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయంలో అదనపు ఎస్పీ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితులను చంపి శవాన్ని డోర్ డెలివరీ చేయించిన జగన్ నీతులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఐదేళ్ల రాక్షస పాలన సాగించిన కారణంగా 11 సీట్లకే పరిమితం కావాల్సి వచ్చిందనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హితవుపలికారు. నీతి నిజాయితీగా పనిచేసే అధికారులకు తాము అండగా ఉంటామన్నారు. టీడీపీ నేత మధు ఆయన వెంట ఉన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలి



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(వైద్యం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట పార్టీ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బాల గురవం బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచేది లేదని చెప్పి ఇప్పుడు మాట తప్పడం సరికాదన్నారు. చార్జీల భారం మోపడమేగాక విద్యుత్ కోతలు విధిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎస్పీడీసీఎల్ ఎండీ సంతోషరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, ఏఐసీసీ బీసీ సెల్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి సుప్రజ, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి లోకేష్ రెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థలో ఆజాద్ సేవలు శ్లాఘనీయం



తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో, ముస్లిం మైనార్టీల సంక్షేమంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు శ్లాఘనీయమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఆజాద్ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పలువురు అధికారులు పుష్పాంజలి ఘటించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆజాద్ దేశ మొదటి విద్యాశాఖ మంత్రిగా గొప్ప విద్యా విధానానికి పునాది వేశారని గుర్తు చేశారు. నిరక్షరాస్యత నిర్మూలనకు, ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, డీఎంహెచ్‌వో శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ జి.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ఉత్తర్వులు వెలువరించారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

స్వావలంబి అభియాన్ తిరుపతి కన్వీనర్‌గా కృష్ణహరీష్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వావలంబి తిరుపతి జిల్లా కన్వీనర్‌గా సిరిగిరి కృష్ణ హరీష్ నియమితులయ్యారు.ఈ మేరకు ఆ సంస్థ ఉమ్మడి చిత్తూరు విభాగ్ ప్రముఖ్ డాక్టర్ మార్గాని సోమశేఖర్ తెలిపారు. కృష్ణ హరీష్‌ను పలువురు అభినందించారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 75 వినతులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 75 వినతులు అందాయి. ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచారి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ చేయండి
కమిషనర్‌కు శివజ్యోతినగర్, అయ్యప్పకాలనీ వాసుల మొర



అటవీ సరిహద్దు ప్రాంతంలో ఇరుకు రోడ్డు

తిరుపతి, నవంబరు11(ఆంధ్రజ్యోతి) : అస్పష్టంగా ఉన్న అటవీ సరిహద్దులను గుర్తించి, రోడ్డు విస్తరణ చేసి, రాకపోకలకు సులభ మార్గం ఏర్పాటు చేయాలని 45వ డివిజన్‌లోని అయ్యప్ప కాలనీ, శివజ్యోతి నగర్ వాసులు విజ్ఞప్తి చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ఇరు కాలనీ వాసులు కమిషనర్ మౌర్యకు వినతిపత్రం అందజేశారు. తమ కాలనీలోని రహదారి ఇరుకుగా ఉండడంతో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. తమ డివిజన్లలో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్లు అనిల్ కుమార్, నరసింహ ఆచారి కోరారు. మాస్టర్ ప్లాన్ రోడ్లకు తమ స్థలం ఇచ్చామని టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, డ్రైనేజీ కాలువల్లో మురుగు తొలగించాలని, రవీంద్ర నగర్‌లో డ్రైనేజీ కాలువలు, తెలుగు గంగ నీరు సరఫరా చేయాలని, కొరమేనుగుంటలోని తమ ఇంటి వద్ద వర్షపు నీరు ఆగిపోతోందని పరిష్కారం చూపాలని, నీటి పన్ను ఎక్కువగా వస్తోందని పరిష్కరించాలని నారాయణపురానికి చెందిన నగేష్ కోరారు. అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన కమిషనర్ ఆయా విభాగాల అధికారులకు అర్జీలను కేటాయించారు.

భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించండి



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగా భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని ప్రభుత్వాలు తీసుకొచ్చాయని చెప్పారు. దాన్ని పునరుద్ధరించి, కార్మికుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు రోడ్డున పడ్డారని, దీనిపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు.ప్రజానాట్య మండలి రాష్ట్ర కారదర్శి పెంచులయ్య, ఏఐటీయూసీ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, రవి, శివకుమార్, రాజా, సుశీల, పార్వతి పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపునకు క్రీడలు దోహదం
అగ్రిలో అట్టహాసంగా క్రీడా పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ అప్పారావు

తిరుపతిరూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో సృజనాత్మకత, ఏకాగ్రత, నాయకత్వ లక్షణాల పెంపునకు క్రీడలు దోహదం చేస్తాయని ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ అప్పారావు తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల వేదికగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల విద్యార్థులకు క్రీడా పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఆర్.శారదజయలక్ష్మితో అప్పారావు కలసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు బృందంగా ఏర్పడి పనిచేసే సంస్కృతిని,ఆరోగ్యకరమైన పోటీని పెంచి శారీరక, మానసిక దృఢత్వానికి బీజం వేస్తాయని తెలిపారు. వర్సిటీ విద్యార్థి వ్యవహారాల డీన్ ప్రొఫెసర్ జి.కరుణాసాగర్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో క్రీడలు భాగస్వామ్యం కావడం వల్ల వ్యాధులు దరిచేరకుండా ఉంటాయని చెప్పారు. అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీ.రమణ, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవికాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నివాసాల మధ్య బెల్టుషాపులు తొలగించాలి

తిరుపతి(లీలామహల్), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలో నివాసాల మధ్య ఏర్పాటు చేసిన బెల్టు షాపులను తొలగించాలని వైసీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దామినేటి కేశవులు కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన షాపులను తొలగించకపోతే ప్రజలతో కలిసి ధ్వంసం చేస్తామని హెచ్చరించారు.

యువ తరంగ్ సక్సెస్
ఎస్వీయూ ఉన్నతాధికారుల హర్షం



విలేకరులతో మాట్లాడుతున్న వీసీ అప్పారావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో మూడు రోజుల పాటు నిర్వహించిన యువ తరంగ్-2024 విజయవంతం కావడం పట్ల ఆ వర్సిటీ ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం వర్సిటీ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు తదితరులు విలేకరులతో మాట్లాడారు. యువ తరంగ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు, విజేతలకు అభినందనలు తెలియ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యార్థుల నుంచి ఎలాంటి ప్రవేశ రుసుం కట్టించుకోకుండా ఉచిత రవాణా, వసతి, భోజన సదుపాయాలు కల్పించామన్నారు. యువ తరంగ్ విజయవంతంలో కీలకంగా వ్యవహరించిన కల్చరల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు వివేక్, హరికృష్ణలను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో జాతీయ యువజనోత్సవాలు నిర్వహించేందుకు అవసరమైన స్ఫూర్తిని యువ తరంగ్ నింపిందన్నారు. దక్షిణాది యువజనోత్సవాల్లో త్వరలో తమిళనాడులోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో జరగనున్నాయని, యువ తరంగ్ విజేతలను పంపనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణ యాదవ్, అకడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



సముద్రపు కాకుల సందడి









తిరుపతి జిల్లా వాకాడు సమీపంలోని కొండూరుపాళెం ప్రాంతంలో సీగల్స్, పెయింటెడ్ స్టార్క్స్ సందడి చేస్తున్నాయి. చలికాలం మొదలవగానే విదేశాల నుంచి ఈ విహంగాలు వచ్చి దిగాయి. చిన్న చేపలూ, రొయ్యలూ, ఎండ్రకాయలూ వేటాడే ఈ పక్షులను సముద్రపు కాకి, కాస్పియన్ టెర్న్ అని కూడా అంటారు. పరిమాణంలో చిన్నదైనా చాలా ఎత్తుకు ఎగురుతూ వేగంగా కిందకి దూసుకు వస్తుంది. ఇవి గుంపులుగానే కనిపిస్తుంటాయి. సమూహాలుగా దేశాలు దాటి ప్రయాణిస్తాయి. పెయింటెడ్ స్టార్క్ (ఎర్రకాళ్ల కొంగ) వెదురు పట్టులో చింత చెట్ల మీద ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటుంది. సముద్రపు కాకులు నేలపట్టులో కనిపించవు. పులికాట్‌లో అక్కడక్కడా తారసపడతాయి.



కాకినాడ్ హోప్ ఐలెండ్స్‌లోనూ ఇవి ఇదే కాలంలో కనిపిస్తాయి. అయితే వీటి సంఖ్య అక్కడ 200 కి మించి ఉండదని అంటారు. కొండూరుపాళెం, తూపిలిపాళెం ఉప్పుటేరులో మాత్రం వందలాదిగా సముద్రకాకులు సందడి చేస్తున్నాయి.

-వాకాడు, ఆంధ్రజ్యోతి





శైవక్షేత్రాల్లో దీపకాంతులు

కార్తీక మాసం రెండో శుక్రవారం. సాయం సంధ్యవేళ శైవక్షేత్రాల్లో భక్తులు నేతి దీపాలు వెలిగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ వైష్ణవ పుష్కరిణిలో లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. తిరుపతిలోని కపిలతీర్థంలో మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.







వెలుగులీనుతున్న శ్రీకాళహస్తిలోని వైష్ణవ కోనేరు



కపిలతీర్థంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సమస్య మొదటికే..!

● మళ్లీ సెల్ టవర్ ఎక్కిన దళిత రైతులు



కేవీబీపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారులు మాట తప్పారంటూ కళత్తూరు దళిత రైతులు మళ్లీ సెల్ టవరెక్కారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కిందకు దిగమంటూ సోమవారం సాయంత్రం భీష్మించారు. కళత్తూరు రెవెన్యూ బ్లాక్ నెం.4లోని భూములకు రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చారు. ఆ భూములు తమవంటూ అటవీశాఖ అడ్డంకులు కల్పిస్తోందంటూ శనివారం ఉదయం ఈ రైతులు సెల్ టవర్ ఎక్కిన విషయం తెలిసిందే. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు మునిరత్నంరెడ్డి, ఎఫ్ఆర్వో రాధికారెడ్డి తదితరులు సమస్యను వంద రోజుల్లో పరిష్కస్తామని హామీ ఇవ్వడంతో దిగొచ్చారు. కాగా, ఆదివారం భూముల వద్ద వెళ్తున్న తమను అటవీశాఖ అధికారులు అడ్డగించారని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం తిరిగి భూముల వద్దకు వెళ్లితే ఎఫ్ఆర్వో మాధవిరెడ్డి అడ్డుకోవడంతో పాటు దుర్భాషలాడారన్నారు. వీరి తీరుకు నిరసనగా సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో పురుగులమందు డబ్బాలతో టవర్‌పైకి ఎక్కారు. సమస్య పరిష్కారమయ్యే దిగేది లేదన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వారికి నచ్చజెప్పినా రైతులు పట్టించుకోలేదు. సమయం ఇస్తే సమస్యను పరిష్కరిస్తామని ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్ కళత్తూరు దళిత రైతులతో చెప్పారు. సోమవారం రాత్రి 9 గంటలకు వీరు రైతులతో చర్చించారు. రైతులు మాత్రం ససేమిరా అన్నారు. ఇంతలో నలుగురు మహిళలు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. పోలీసులు వెంటనే స్పందించి ప్రమాదం జరగకుండా కాపాడారు. తమ సమస్య పరిష్కారం అయ్యే వరకు టవర్ దిగేది లేదని రైతులు తెగేసి చెప్పారు. దీంతో వచ్చిన అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

బడ్జెట్‌పై నేతల మాట

సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేసేలా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టింది. అన్నివర్గాల ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘనత ఎన్డీఏ కూటమికే చెల్లింది.

- ఆరణి శ్రీనివాసులు, తిరుపతి ఎమ్మెల్యే

ఆశాజనకంగా లేదు

బడ్జెట్‌లో రైతులకు, నిరుద్యోగ భృతి, ఎస్సీలకు మేలు చేసేలా ఆశించినంత లేదు. హడ్కో రుణాలను చక్రవడ్డీలతో తీసుకురావడం ఏమిటో అర్థం కావడంలేదు. అప్పులు తీసుకురావడంలో గత ప్రభుత్వంతో పోటీ పడుతున్నట్లుంది.

- డాక్టర్ చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ నేత

వెనుకబడిన వర్గాల సంక్షేమమే లక్ష్యం

వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం రూ3097కోట్లు కేటాయించడం అభినందించదగ్గ విషయం. టీడీపీ తొలినుంచీ వెనుకబడిన వర్గాలకు బడ్జెట్లో అగ్రస్థానం కల్పిస్తోంది. ఇప్పుడూ బీసీలకు వెన్నుదన్నుగా బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టడం హర్షదాయకం.

- నరసింహ యాదవ్, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్

ఏపీ భవిష్యత్తు మారబోతోంది

బడ్జెట్‌లో ప్రజా శ్రేయస్సు, సర్వతోముఖాభివృద్ధితో పాటు దీర్ఘకాలిక ప్రయోజనాలే లక్ష్యంగా కనిపిస్తోంది. మహిళలు, నిరుద్యోగులు చిన్న చిన్న కుటీర పరిశ్రమల ఏర్పాటుకు సబ్సిడీ రుణాలను మంజూరుకు పెద్దపీట వేయడం హర్షణీయం. గత ఐదేళ్లుగా అధోగతిలోకి వెళ్లిపోయిన ఏపీ భవిష్యత్తు కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో మారబోతోంది.

- భానుప్రకాష్ రెడ్డి, టీటీడీ సభ్యుడు

వేతన జీవులగురించి పట్టించుకోలేదు

రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు,వారి ఉద్యోగ భద్రత గురించి ప్రస్తావన లేదు. ఇది బాధాకరం.

- కందారపు మురళి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎన్నికల హామీలపై ప్రకటన ఏది?

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు ఎప్పటి నుంచి అమలు చేస్తారన్న విషయాన్ని బడ్జెట్‌లో పొందుపరచలేదు. దీంతో ప్రజల్లో హామీల విషయమై స్పష్టత లేకుండా పోయింది.

- వి.నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి

పాజెక్టులకు మొండి చేయి

రాయలసీమలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ప్రస్తావించలేదు. రైతు సంక్షేమంపై స్పష్టత ఇవ్వలేదు. ట్రూఅప్ చార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన హామీపై ప్రకటన లేదు.

- ఎ.రామానాయుడు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

యువతకు పెద్దపీట

ఉన్నత విద్యకు రూ.2,326 కోట్లు కేటాయించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు రూ.1,215 కోట్లు వెచ్చించనున్నారు. యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖలకు రూ.322 కోట్లు కేటాయించడంతో పాటు ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా కింద 3 శాతం రిజర్వేషన్ కల్పించడం బాగుంది. యువతకు పెద్దపీట వేసినట్లు కనిపిస్తోంది.

- డాక్టర్ కొండేటి సునీత, ఎకనమెట్రిక్స్ డిపార్ట్‌మెంట్, ఎస్వీయూ

అన్ని రంగాలకూ సమ ప్రాధాన్యం

పరిశ్రమలు, వాణిజ్య రంగాలకు రూ.3,127 కోట్లు కేటాయించడం గొప్ప విషయం. పంచాయతీ ప్రధాన రంగాలకు ఆశాజనకమైన కేటాయింపులు జరిగాయి. బడ్జెట్‌లో అన్ని రంగాలకు సమ ప్రాధాన్యం ఇవ్వడం సంతోషదాయకం.

- మోహన్‌కుమార్‌రాజు, తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

నేర ప్రవృత్తికి దూరంగా ఉండండి

● యువతకు ఎస్పీ హితబోధ

● పద్మావతి వర్సిటీలో అవగాహనా కార్యక్రమానికి విశేష స్పందన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తికి దూరంగా ఉంటూ, ఉన్నత భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని యువతకు ఎస్పీ సుబ్బరాయుడు హితబోధ చేశారు. సైబర్, డ్రగ్స్ నేరాలు, చిన్నారులు, మహిళలపై హింసకు వ్యతిరేకంగా పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. తమలోని ప్రతిభ, సృజనాత్మక ఆలోచనలను దేశ.. వ్యక్తిగత భవిష్యత్తు కోసం ఉపయోగించాలని కోరారు. చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు, హింసకు పాల్పడుతున్న వారిపై కఠిన శిక్షలు తీసుకుంటున్నామని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిస కావద్దని, డ్రగ్సకు సంబంధించిన సమాచారం తెలిస్తే 100, 112 కు సమాచారం అందించాలన్నారు. అలాంటి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ క్రైం బాధితులు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు లేదా సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. చిన్న వయసులోనే పిల్లలకు మొబైల్ ఫోన్లు ఇవ్వడం వల్ల తెలియక అనేక యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ద్వారా పలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సైబర్ క్రైం బాధితుల్లో డిగ్రీ లోపు యువత ఎక్కువగా ఉన్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. చిన్నారులపై అత్యాచార ఘటనల్లో ఎక్కువగా పక్కింటి వారు, తెలిసిన వారే బాధ్యులుగా ఉంటున్నారన్నారు. ఇలాంటి నేరాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. గంజాయి సరఫరాకు కాలేజీలను అడ్డాగా మార్చుకొని అక్రమ దందా సాగిస్తున్నారన్నారు. మత్తు పదార్థాల నివారణకు విద్యార్థులు, అధ్యాపకుల సహకారం ప్రభుత్వానికి అవసరమన్నారు. మొబైల్ ఫోన్లకు వచ్చే ఓటీపీల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అవగాహనతోనే సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని పద్మావతి వర్సిటీ వీసీ ఉమ అభిప్రాయపడ్డారు. ఈ దిశగా విద్యార్థులు తమ పరసరాల్లోని వారికి అవగాహన కల్పించాలన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ తదితరులు

అర్జీలకు పరిష్కారం చూపండి



● అధికారులకు కలెక్టర్ ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో వచ్చే వినతులకు త్వరగా పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయనతో పాటు జేసీ శుభం బన్సల్, రెవెన్యూ అధికారులు వినతులు స్వీకరించారు. మొత్తం 184 అర్జీలు అందగా అందులో 120 భూ సమస్యలపైనే ఉన్నాయి.

సాగుభూమిని కబ్జా చేశారు



30 ఏళ్లగా బీడు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. 3 ఎకరాల్లో మామిడి మొక్కలు నాటి బిడ్డల్లా జాగ్రత్తగా చూశాం. రాత్రికి రాత్రే గ్రామానికి చెందిన పవన్, మరికొంత మంది మామిడి మొక్కలు నరికేయడమేగాక ఆ భూమిలో రేకుల షెడ్డు వేశారు. అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మీరైనా న్యాయం చేయండి.

- రామకృష్ణ, బంగారెడ్డికండ్రిగ, వడమాలపేట మండలం

స్థలం కబ్జాకు ప్రయత్నం



నాకు సరిగా మాటలు రావు. పైగా వికలాంగురాలిని.తండ్రి నాగయ్య వద్ద ఉంటున్నా. నా కోసం 26ఏళ్ల క్రితం ఇంటి పక్కనే కొంత స్థలాన్ని మా తండ్రి కొనిచ్చాడు.ఆ స్థలం తమదంటూ కొంతమంది గతంలో ఇబ్బందిపెట్టారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కొంతకాలం ఊరుకున్నారు. మళ్లీ వచ్చి స్థలం కబ్జాకు ప్రయత్నిస్తున్నారు. పోలీసులకు, కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. న్యాయం చేయండి.

- జెస్సీ, వేంబాకం హరిజనవాడ, నాగలాపురం

జీవనోపాధి కల్పించకపోతే ఆత్మహత్యే శరణ్యం



గతంలో విజయవాడలో ఓ ప్రైవేటు కంపెనీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేశా. రోడ్డు ప్రమాదంలో కాళ్లు, చేతులు విరిగి మంచానపడ్డాను. నడవడానికి ఇబ్బందిగా ఉంది. ఏదైనా ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని అధికారులను వేడుకుంటున్నా. ముగ్గురు కలెక్టర్లు మారినా ఏ ఒక్కరూ ఉపాధి కల్పించలేదు. ఇలాగైతే ఆత్మహత్యే శరణ్యం.

- మురళి, ముత్యాలమ్మ గుడివీధి, శ్రీకాళహస్తి



పెరిగిన ఓపీ కేంద్రాల్లో ఓపీ తీసుకుంటున్న రోగులు

రుయాలో అదనపు ఓపీ కేంద్రాలు

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

తిరుపతి(వైద్యం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు సులువుగా ఓపీ తీసుకునేందుకు సూపరింటెండెంట్ రవిప్రభు సోమవారం మూడు అదనపు ఓపీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. గతంలో కేవలం నాలుగు ఓపీ కేంద్రాలే ఉన్నాయి. దీనికితోడు ఈ-ఆస్పత్రి పేరుతో నూతన విధానాన్ని ప్రవేశ పెట్టడంతో ఓపీ తీసుకోవడం రోగులకు కష్టంగా మారింది. దీనిపై 'రుయాలో 'ఓపీ'కకు పరీక్ష' శీర్షికన ఈనెల 7న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో అధికారులు సోమవారం నుంచి అదనంగా మరో మూడు ఓపీ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీంతో 11 గంటలకే ఓపీ కేంద్రంలో అందరికీ ఓపీ అందించేందుకు వీలైంది.

టీడీఆర్ బాండ్లపై విజి'లెన్స్'

● విచారణ వేగవంతం చేసిన అధికారులు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వెలుగుచూసిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణంలో విచారణ వేగవంతమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లా విజిలెన్సు విభాగం ఎస్పీ కరీముల్లా షరీఫ్ నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. వీరిలో విజిలెన్సు డీఈ నాగసురేష్, సీఐ చంద్రశేకర్ నాయక్, ఏఈలు సౌజన్య, రామ్మోహన్ తదితర సిబ్బంది ఉన్నారు. అభివృద్ధి పేరుతో గత వైసీపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రోడ్ల ముసుగులో టీడీఆర్ బాండ్ల కుంభకోణానికి పాల్పడినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక తిరుపతితో పాటు రాష్ట్రంలోని పలు మున్సిపాల్టీల్లో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణాలపై విచారణకు ఆదేశించింది. ఈక్రమంలో తిరుపతి కార్పొరేషన్ అధికారుల నుంచి టీడీఆర్ బాండ్లకు సంబంధించిన అన్ని రికార్డులను విజిలెన్సు అధికారులు తెప్పించుకున్నారు. సోమవారం నుంచి విచారణ ప్రారంభించారు. ఆ వివరాల ప్రకారం ఒక్కో రోడ్డును పరిశీలిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్ల అవసరం ఎంత వరకు ఉందనే కోణంలో విచారిస్తున్నారు. ప్రతి రోడ్డును క్షుణంగా పరిశీలించి భూములు ఇచ్చిన వారు, బెదిరించి భూములు లాక్కున్న వారుంటే వారినుంచీ రాత పూర్వకంగా స్టేట్‌మెంట్లు తీసుకోనున్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు ప్రణాళికాబద్ధంగా వేశారా లేదా అనేదీ పరిశీలించనున్నారు. రోడ్లు వేసిన ప్రాంతంలో అప్పట్లో భూమి విలువ ఎంత అనే దానిపైనా విజిలెన్సు అధికారులు దృష్టి సారించారు. ప్రతి వ్యక్తిని కలిసి విచారించి స్టేట్‌మెంట్లు నమోదు చేస్తామని డీఈ నాగసురేష్ చెప్పారు.

ఉపాధ్యాయులకు 'ఉత్తమ' అవార్డులు

● సీఎం చేతుల మీదుగా ప్రదానం

తిరుపతి(విద్య), నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి 'ఉత్తమ' ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నుంచి అవార్డులు స్వీకరించారు. అవార్డులు అందుకున్న వారిలో అత్యధికంగా తిరుపతి జిల్లా నుంచే ఎనిమిది మంది (ఒక ప్రధానోపాధ్యాయుడు, ఏడుగురు ఉపాధ్యాయులు) ఉన్నారు. ఏర్పేడు మండలం పల్లం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు టి.ఆనంద్ ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. శ్రీకాళహస్తి మండలం జడ్పీ హైస్కూల్ సోషియల్ స్టడీస్ టీచర్ సురేష్ కునాటి, తొట్టంబేడు మండలం దిగువ సాంబయ్యపాలెం మండల ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ కె.బాలసుబ్రహ్మణ్యం, చంద్రగిరి మండలం రంగంపేట జడ్పీ హైస్కూల్ పీఈటీ డాక్టర్ పి.ప్రభాకర్‌రావు, ఏర్పేడు మండలం బండారుపల్లె జడ్పీ హైస్కూల్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు ఎం.సుబ్రహ్మణ్యం, పిచ్చాటూరు మండలం రాజానగరం జడ్పీ హైస్కూల్ బయాలజీ ఉపాధ్యాయుడు వి.కామాక్షయ్య, దొరవారిసత్రం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) పీజీటీ బి.యామిని, కేవీబీ పురం కేజీబీవీ ఇంగ్లిష్ టీచర్ ఆర్.మంజువాణి అవార్డులు అందుకున్నారు.


మోహన్‌నాయుడికి ఉత్తమ అధ్యాపక అవార్డు

తిరుపతిరూరల్, నవంబరు9(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వ్యవసాయ కళాశాల స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ విభాగ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ గుట్టపల్లి మోహన్‌నాయుడికి రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు లభించింది. సోమవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు.



చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న మోహన్‌నాయుడు

'అగ్రి'లో క్రీడాపోటీలు ప్రారంభం



తిరుపతిరూరల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వ్యవసాయ కళాశాల వేదికగా ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల విద్యార్థులకు సోమవారం క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. వర్సిటీపరిధిలో 18కళాశాలలకు చెందిన 410మంది విద్యార్థులు ఈపోటీలలో పాల్గొన్నారు. తొలిరోజు విద్యార్థులకు నిర్వహించిన బాల్‌బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, చెస్, క్యారమ్స్ పోటీలు హోరాహోరీగా సాగాయి. విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు.



పుత్తూరు వార్తలు

తెలుగు భాషోపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ

పుత్తూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు పాఠ్యాంశాలు, ఇతివృత్తాలు, ప్రక్రియలు, పాఠ్య ప్రణాళికలో బోధన, డిజిటల్ విద్య, నమూనా ప్రశ్న పత్రాలపై అవగాహన కలిగి ఉండాలని డీవైఈఓ ప్రభాకర్‌రాజు చెప్పారు. టెన్త్ కొత్త పాఠ్యపుస్తకాలపై ఆరు మండలాల తెలుగు భాషోపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ సోమవారం పుత్తూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగింది. ఈ సందర్భంగా డీవైఈఓ... పాఠ్యాంశాల బోధనపై సూచనలు, మెలకువలను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భువనేశ్వరి, శిక్షణ ఉపాధ్యాయులు, పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం, పిచ్చాటూరు, నాగాలాపురం, సత్యవేడు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు హిమజలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

పుత్తూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హిమజ డిగ్రీ కళాశాలలో ఈనెల 12న మంగళవారం ఉదయం 10 గంటలకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు కళాశాల చైర్మన్ సురేంద్రరాజు, ప్రిన్సిపాల్ లోకనాథం తెలిపారు. గత నాలుగేళ్లలో ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు నెం.9866450460, 9885895494లలో సంప్రదించాలని కోరారు.

రంగోలిలో లీలావతికి తృతీయస్థానం


లీలావతిని అభినందిస్తున్న అధ్యాపకులు

పుత్తూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో జరుగుతున్న యువ తరంగంలో రంగోలి పోటీలో పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి లీలావతి తృతీయ స్థానంలో నిలిచింది. దీంతో సోమవారం ఆమెను అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కోటేశ్వరయ్య మాట్లాడుతూ... విద్యతో పాటు సాంస్కృతిక రంగాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరచడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వాణిశ్రీ, వీరయ్య, శ్రీనివాసులు, సావిత్రి, జ్యోతి, లక్ష్మీబాయిలు పాల్గొన్నారు.

పాఠశాల స్థలం ఆక్రమణ



పుత్తూరు టౌన్, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ 13వ వార్డు ఎన్టీఆర్ కాలనీలో గుట్ట పోరంబోకులో స్కూల్‌కు కేటాయించిన స్థలం ఆక్రమణకు గురైనట్టు తహసీల్దార్‌కు గత నెలలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బాలసుబ్రమణ్యం వాపోయారు. రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్టు వదిలేయడంతో గుట్ట పోరంబోకు లో ఆక్రమణదారులు పిల్లర్లుతో నిర్మాణాలు సాగిస్తునాన్నరని తెలిపారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించాలని ఆయన కోరారు.

కౌలు రైతులకు రూ.20 వేలు ఇవ్వాలి

పుత్తూరు టౌన్, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు వ్యవసాయానికి రూ.20 వేలు ఇవ్వాలని రైతు సంఘం జిల్లా నాయకుడు గోవిందస్వామి పేర్కొన్నారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం పుత్తూరు మండల నాయకుడు మహేష్ మాట్లాడుతూ గాలేరు నగరి ప్రాజెక్ట్ పూర్తి చేసి రైతులకు నీరందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, కృష్ణారెడ్డి, కాశి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక సోమవారం పూజలు



వడమాలపేట, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు శివాలయాల్లో కార్తీక నెల రెండో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భవానీ శంకర ఆలయంలో వేకువ జామున మహాలింగానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. పట్టు పీతాంబరాలు, పూలమాలలతో విశేషంగా అలంకరించారు. వేద మంత్రాలతో మహా లింగార్చన నిర్వహించారు. సదాశివకోనలో భక్తులు జాలువారే జలపాతంలో కార్తీక స్నానాలు ఆచరించి తడిబట్టలతో సదాశివుడిని దర్శించుకున్నారు. అప్పలాయగుంట చంద్రమౌళీశ్వర స్వామి, ఓబీఆర్ కండ్రిగ ఉమామహేశ్వర స్వామి, వడమాలపేటలోని గౌరీ శంకర్ ఆలయాల్లో మహాశివుని లింగానికి అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. మహిళలు ఆలయాల వద్ద ప్రమిదలతో నేతి దీపాలు వెలిగించి దీప దర్శనం చేసుకున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రవకుమార్

వడమాలపేట, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని పుత్తూరు డీఎస్పీ రవికుమార్ చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు డిజిటల్ స్క్రీన్ ద్వారా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. నేరగాళ్లు ఆధునిక టెక్నాలజీ ద్వారా మోసాలకు పాల్పడుతున్నారన్నారు. గ్రామాల్లో ప్రజలు ఆశలకు లోనై సైబర్ నేరాల బారిన పడి నష్టపోతున్నారని చెప్పారు. బ్యాంక్ అకౌంట్, ఆధార్ నెంబర్లు అనుమానితులకు ఇవ్వకూడదని చెప్పారు. ఎస్ఐ ధర్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు నవనీత పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడి మృతి

శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి చెందాడు. తొట్టంబేడు మండలం బసవయ్యపాళెం గిరిజనకాలనీకి చెందిన సుబ్బరాయులు(25) భవన నిర్మాణ కార్మికుడు. ద్విచక్ర వాహనానికి పెట్రోల్ నింపుకునేందుకు సోమవారం మధ్యాహ్నం సమీపంలోని కన్నలి గ్రామం వద్దకు వెళ్లాడు. పెట్రోల్ పట్టించుకున్న అనంతరం తిరిగి వస్తుండగా కన్నలి వద్ద నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో సుబ్బరాయులు తల రోడ్డుకు తాకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం ఏరియా ఆస్పత్రి మార్చ్యురీకి తరలించారు.

శాస్త్రోక్తంగా ఆకాశదీపం

శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వ రాలయంలో సోమవారం ఆకాశ దీపాన్ని శాస్త్రోక్తంగా వెలిగించారు. ప్రముఖ శైవ క్షేత్రమైన ముక్కంటి ఆలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రతి రోజు ఆకాశ దీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ వేదపండితులు ఊంజల్ మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు దర్శించుకున్నారు.

క్రీడాపోటీల్లో ఓం నారాయణ పాఠశాల విద్యార్థి ప్రతిభ

ఏర్పేడు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహించిన జిల్లా స్థాయి రగ్బీ ఎంపికల్లో ఓం నారాయణ పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈనెల 9న కడప జిల్లా కమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి రగ్బీ క్రీడా పోటీల్లో బాలికల కేటగిరిలో చింత చందన ప్రతిభ కనబరిచింది. సోమవారం కరస్పాండెంట్ మోహన్, పీఈటీ భానుప్రకాష్ చందనను అభినందించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

తెల్లక్వార్ట్జ్ రాయి లారీ స్వాధీనం

తడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తెల్లక్వార్ట్జ్ రాయిని అక్రమంగా చెన్నైకు తరలివెళ్తున్న లారీని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నాయుడుపేట నుంచి చెన్నై వైపు తెల్లక్వార్ట్జ్ రాయితో వెళ్తున్న టిప్పర్‌ను భీములవారిపాళెం చెక్‌పోస్టులో సోమవారం తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలుకు వెళ్లేందుకు ట్రాన్సిస్టు పాసు కలిగి ఉండడాన్ని గుర్తించారు. అయితే చెన్నై వైపు వెళ్తుండడంతో అక్రమ రవాణాగా గుర్తించి కేసు నమోదు చేశామని సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ తెలిపారు. లారీ డ్రైవర్, క్లీనర్, యజమాని యనమల వెంకటేశ్వర్లు, మన్నవరపు రమేష్, మేక శివకుమార్‌తో పాటు తెలంగాణ రాష్ట్రంలో దిగుమతి చేసుకునే మల్లికార్జున మినరల్ యజమాన్యంపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు. అక్రమ రవాణా గురించి ఎటువంటి సమాచారమైనా పోలీసులకు తెలపాలని, లేదా వాట్సాప్ నెంబరు 8688478206కు మెసేజ్ ఇవ్వాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ కొండపనాయుడు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండల పరిధిలోని కోటపోలూరు సమీపంలో సోమవారం రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 30 ఏళ్లు ఉంటుందని, అతడి వద్ద ఎటువంటి ఆధారాలేవి లభ్యం కాలేదని రైల్వే ఎస్ఐ చెన్నకేశవులు తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

స్వర్ణముఖి నదిలో మృతదేహం

నాయుడుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట స్వర్ణముఖినదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని స్థానికులు సోమవారం సాయంత్రం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ శ్రీహరిబాబు సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి వయస్సు 40 నుంచి 50 సంవత్సరాలలోపు ఉంటుందని ఎస్ఐ తెలిపారు.



రైల్వే స్టేషన్ ముఖ ద్వారం - ప్లాట్‌ఫాంలో ఏర్పాటు చేసిన లిఫ్టులు

సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు మహర్దశ

రూ.9.5 కోట్లతో అభివృద్ధి పనులు ● ప్లాట్‌ఫాంల ఆధునికీకరణ ● ప్రయాణికులకు ప్రత్యేక వసతులు

సూళ్లూరుపేట, నవంబరు 11: తెలుగు, తమిళ రాష్ట్రాల సరిహద్దులో ఉన్న సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన షార్ కేంద్రానికి ముఖ ద్వారమైన సూళ్లూరుపేట శాటిలైట్ టౌన్, వాణిజ్య నగరాలకు ధీటుగా అభివృద్ధి చెందుతున్న విషయం తెలిసిందే. ఇక్కడి రైల్వేస్టేషన్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు రైల్వేశాఖ అమృత్ పథకం కింద ఎంపిక చేసి రూ.9.5 కోట్లు కేటాయించింది. స్టేషన్‌లో మూడు ప్లాట్ ఫాంలు ఉండగా ప్రయాణికులకు వీలుగా రెండు లిఫ్టులు ఏర్పాటు చేస్తున్నారు. తూర్పువైపున ఉన్న మూడో ప్లాట్‌ఫారం నుంచి వచ్చే ప్రయాణికులకు కూడా లిఫ్టు అందుబాటులో ఉండేలా నిర్మాణాలు జరుగుతున్నాయి. సరుకులు, పార్శిళ్లు వచ్చినప్పుడు వాటిని సులువుగా చేర్చేందుకు ప్రత్యేక వాహనాలు వెళ్లేలా ప్లాట్‌ఫారం వరకు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తున్నారు. స్టేషన్‌లో ఉచితంగా మినరల్ వాటర్ అందుబాటులో ఉండేలా నీటిశుద్ధి ట్యాంకు నిర్మిస్తున్నారు. స్టేషన్‌కు ఇరువైపులా ప్రయాణికుల కోసం మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. విశ్రాంత భవనానికి కూడా కొత్త హంగులు దిద్దుతున్నారు. రైల్వే స్టేషన్ చూడముచ్చటగా కనిపించేలా ముఖద్వారం నిర్మిస్తున్నారు. వాహనాల పార్కింగ్ ప్రదేశాన్ని విస్తరించడమే కాకుండా భద్రత కల్పించేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో స్టేషన్ పరిధిలో చోరీలకు అడ్డుకట్ట


మూడో నెంబరు ప్లాట్‌ఫాంపై కొత్త షెడ్ నిర్మాణం

పడే అవకాశం ఉంది. ఇక స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు తెలియజేసే వీలుగా కోచ్ ఇండికేషన్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ప్లాట్‌ఫాం షెడ్‌లను వెడల్పు చేసి రంగులు వేయడం వంటి సుందరవనంగా తీర్చిదిద్దే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే అన్ని పనులు పూర్తయి రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.



చిట్టేడులోని యానాదుల గురుకుల పాఠశాల - ప్రహరీ పక్కనే కుప్పపోసిన కోళ్ల వ్యర్థాలు

గురుకులం పక్కన కోళ్ల వ్యర్థాల డంప్

దుర్గంధంతో విద్యార్థులు, ఉపాధ్యాయుల ఇబ్బందులు

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు యానాదుల గురుకుల జూనియర్ కళాశాల, పాఠశాలకు అంటువ్యాధులు ముప్పు పొంచి ఉంది. ఇక్కడి గురుకులం పాఠశాలతో పాటు కళాశాలలో సుమారు 450 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. చిట్టేడు, కేశవరం ప్రాంతాల నుంచి కోళ్ల వ్యర్థాలను తీసుకొచ్చి గురుకుల పాఠశాల ప్రహరీ పక్కన పడేస్తున్నారు. ఈ వ్యర్థాల నుంచి నిత్యం దుర్గంధం వెలువడుతుండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు భోజనం చేసే సమయంతో పాటు రాత్రి నిద్రిస్తున్న సమయంలో కూడా దుర్గంధం వస్తుండటంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వ్యర్థాలు గాలిలో వ్యాపించి విద్యార్థుల భోజనంలో కలిసి కలుషితమయ్యే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి కోళ్ల వ్యర్థాలు గురుకులం పక్కన వేయకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



గూడూరు శివాలయం, సూళ్లూరుపేట నాగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

శివాలయాల్లో కార్తీక పూజలు

గూడూరు/సూళ్లూరుపేట/వెంకటగిరి టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా రెండోవ సోమవారం గూడూరు పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి, సంఘమేశ్వరస్వామి ఆలయాలలో భక్తులు కార్తీకదీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాలలో పెద్ద సంఖ్యలో మహిళలు పూజా కార్యక్రమాలు నిర్వహించి కార్తీకదీపాలను వెలగించి స్వామివారిని దర్శించుకున్నారు. ● సూళ్లూరుపేట పట్టణంలోని శివాలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. రైల్వేస్టేషన్ వద్దనున్న నాగేశ్వరస్వామి, మన్నారుపోలూరు సంతానేశ్వరస్వామి, కల్యాణేశ్వరస్వామి, కొరిడి నీలకంఠేశ్వర స్వామి ఆలయాల్లో ఉదయం నుంచే భక్తుల సందడి కనిపించింది. మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. నాగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం అభిషేకం అనంతరం పుష్పాలతో స్వామివారిని అలంకరించారు. ● వెంకటగిరి పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి, రామలింగేశ్వరస్వామి, కర్ణకమ్మ వీధిలోని హరహర క్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్దనున్న మల్లికార్జున భ్రమరాంబిక ఆలయాలు సోమవారం మహిళలతో కిక్కిరిసిశాయి. ఉదయం నుంచి శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

డ్రోన్‌తో పిచికారీపై అవగాహన


డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో సోమవారం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ట్రిపుల్‌ఈ మూడవ సంవత్సర విద్యార్థులు తయారు చేసిన డ్రోన్‌తో పురుగుమందుల పిచికారీపై అధికారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. అతి తక్కువ ఖర్చుతో డ్రోన్ ద్వారా పురుగు మందులు పిచికారీరి చేసే విధానాన్ని వివరించారు.

హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్షత వద్దు

నాయుడుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపవద్దని నవజీవన్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ బాలాజీ రాజు అన్నారు. నాయుడుపేట పట్టణం కుమ్మరివీధిలో హెచ్‌ఐవీ నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కొంత మందికి హెచ్‌ఐవీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సాయిలక్ష్మి, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పరసాకు పరామర్శ

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): గుండె ఆపరేషన్ చేయించుకొని స్వగ్రామం గొట్టిప్రోలులో విశ్రాంతి తీసుకొంటున్న మాజీ మంత్రి పరసా వెంకటరత్నంను సోమవారం టీడీపీ బీసీ సెల్ నాయకులు చిట్టేటి పెరుమాల్, మెస్ రమణయ్య, బి.సుబ్రమణ్యం, ఎల్లయ్య, వి.శ్రీనివాసులు పరామర్శించారు.


పరసారత్నంతో టీడీపీ నాయకులు

సాగు భూములకు పట్టాలు ఇవ్వండి

సూళ్లూరుపేట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) బీఎన్‌కండ్రిగ మండలం కాటూరు పంచాయతీలోని వేదాల శ్రీనివాసపురం దళితులు సాగు చేసుకుంటున్న భూములకు దళితులకే పట్టాలు ఇవ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యవేడు నియోజకవర్గ సీపీఐ కన్వీనర్ చిన్నిరాజ్ మాట్లాడుతూ శ్రీనివాసపుర రెవెన్యూ సర్వే నెంబరు 340లో 39 ఎకరాలను ఆ గ్రామ దళితులు 30 సంవత్సరాలు పైగా సాగుచేసుకొంటుంటే ఇతరులకు పట్టాలు ఇవ్వడం అన్యాయమన్నారు. ఆ భూములను దళితులకు పట్టాలు ఇవ్వాలని ఆర్డీవోకు వినతిపత్రం అందజే శారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చంద్ర, కృష్ణయ్య ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడికి గాయాలు

గూడూరు అర్బన్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండంలోని చెమిర్తి గ్రామ సమీపంలో సోమవారం మోటారు సైకిల్‌ను లారీ ఢీకొనడం యువకు డికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు... చెమిర్తి గిరిజన కాలనీకి చెందిన సురేష్ ఇంటి వద్ద నుంచి ద్విచక్ర వాహనంలో గూడూరుకు వెళ్లేందుకు ప్రధాన రహదారిపై చేరుతుండగా వెంకటగిరి వైపు నుంచి గూడూరు వైపు వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. సురేష్‌కు గాయాలవడంతో గూడూరు ఆస్పత్రికి తరలించారు.

భూముల రీ సర్వేపై సమీక్ష


వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

బాలయపల్లి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): బాలయపల్లి మండలంలో భూముల రీసర్వే వివరాలపై తహసీల్దారు శ్రీనివాసులు సోమవారం సమీక్ష నిర్వహించారు. పంచాయతీల వారీగా వీఆర్వోలతో చర్చించారు. రీసర్వేలో తప్పుగా నమోదైన భూముల వివరాలను సరి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దారు శిరీషా, ఆర్ఐ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

కోట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేశవరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను ఎంఈవో మస్తానయ్య సోమవారం పరిశీలించారు. 1నుంచి 5 తరగతుల విద్యార్థుల ప్రతిభా పాఠశాలను ఎంఈవో అంచనా వేశారు. విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. హెచ్ఎం రమీజాబేగం పాల్గొన్నారు.

ఆ తహసీల్దారుతో పనిచేయలేం

ఆర్డీవోకు సూళ్లూరుపేట రెవెన్యూ సిబ్బంది మొర

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట తహసీల్దారు నరసింహరావుతో పనిచేయలేమని రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఆర్డీవో కిరణ్మయికి మొరపెట్టుకొన్నారు. కార్యాలయంలో పనిచేసే అధికారులు, వీఆర్వోలు సోమవారం ఆర్డీవోను కలిసి తమను తహసీల్దారు ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. పని విషయంలో తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని, సాయంత్రం వేళ చెప్పిన పనిచేసి పూర్తి చేసి వెళ్లాల్సిందేనని బలవంతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాగైతే ఆయనతో కలిసి పనిచేయలేమని చెప్పినట్లు సమాచారం.

సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మద్దతుదారులను గెలిపించండి

డక్కిలి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో త్వరలో జరగనున్న సాగు నీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో పోటీచేసే అభ్యర్థులను గెలిపించాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం వారు స్థానిక టీడీపీ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలపై పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. సాగునీటి సంఘాలకు జరిగే ఎన్నికల్లో పోటీ చేసే నాయకులతో చర్చించారు. వీలైనని సంఘాలు ఏకగ్రీవం అయ్యేలా చూడాలన్నారు. అలాగే టీడీపీ మద్దతుదారులు విజయం సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులను అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. అంతకుముందు టీడీపీ సభ్యత్వ నమోదుపై చర్చించారు. మండలంలో నూరు శాతం సభ్యత్వం పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డక్కిలి చంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ కలపాటి విజకుమార్, పులి జనార్ధనరెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిషోర్ నాయుడు, దందోలు రత్నాకరరెడ్డి, పోకూరు రమేష్, పాయశం గోపాల్, పొట్టా మునెయ్య, అయ్యపరెడ్డి, చంద్రమౌళి, రాజా, ముద్దా మునిస్వామిరెడ్డి, శివప్రసాద్, పీపీ చౌదిరి, వేముల నాగభూషణం నాయుడు, హరినాథ్, కుమార్, సుబాష్ చంద్రబోస్, దందవోలు పెంచలరెడ్డి, ఆలూరు దామోదరనాయుడు, ఆలూరు సుబ్బరామానాయుడు, కలివేలయ్య, మునికృష్ణయ్య, మేరగ రామయ్య, గరిటి చెంచయ్య, సంగనపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యభట్ట నగర్‌లో సమస్యలను పరిష్కరించండి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న షార్ విశ్రాంత ఉద్యోగులు

సూళ్లూరుపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలోని ఆర్యభట్టనగర్, విక్రమ్ సారాభాయ్ నగర్, శ్రీవారి నగర్ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరించాలని షార్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం మున్సిపల్ కమిషనర్ చిన్నయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ లేదని, చిన్నపాటి వర్షమొచ్చిన మురుగుమయంగా మారుతోందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం కాలనీలను సందర్శించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం రెడ్డి, కుమారస్వామి సుదర్శనం, ఆదిశేఖర్, కనకరాజు, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాసరావు, సాంబశివయ్య పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి


ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

సూళ్లూరుపేట/తడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 అందజేయాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద రైతులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ సీజన్ ప్రారంభమైనందున ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోదుగుల పార్థసారధి, రమణయ్య, సుధాకర్ రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు. ● తడ తహసీల్దారు కార్యాలయం వద్ద సీపీఐ రాష్ట్ర ఉపాధ్య క్షుడు రామానాయుడు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.20వేల పెట్టుబడి సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు అందిం చాలన్నారు. రాష్ట్రంలో 12 లక్షల ఎకరాలను రైతులు సాగుచేయకుండా బీడుగా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రకటిం చిన విధంగా పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించి భూములను సాగులోకి తీసు కువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దారు శరత్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సుధాకర్‌రెడ్డి, మనోహర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కత్తిపోట్లకు గురైన విద్యార్థి మృతి

శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజు వేడుకల్లో హత్యాయత్నం జరగడంతో తీవ్రంగా గాయపడ్డ విద్యార్థి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. బుచ్చినాయుడుకండ్రిగ మండలం నెలవాయికి చెందిన విష్ణువర్ధన్‌కు తల్లిదండ్రులు లేరు. అన్న, నాన్నమ్మ సంరక్షణలో పెరుగుతున్నాడు. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం బీఎస్సీ చదువుతున్నాడు. ఈనెల 6న విష్ణువర్ధన్ ధర్మరాజుల స్వామి ఆలయం సమీపంలో చెన్నై రోడ్డు పక్కన స్నేహితులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నాడు. ఇంతలో శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన నలుగురు యువకులు విష్ణువర్ధన్‌పై కత్తితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన విష్ణువర్ధన్‌ను స్థానికులు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో స్విమ్స్‌కు తీసుకెళ్లారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. హత్యాయత్నానికి పాల్పడిన జగన్, వాసు దేవ, మునిరాజా, భరత్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఐదు రోజుల పాటు చికిత్స పొందుతూ వచ్చిన విష్ణువర్ధన్ మృతి చెందాడు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు నారాయణవనం విద్యార్థులు



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

నారాయణవనం, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడా పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సులోచన చెప్పారు. చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన అండర్ 17 జిల్లా స్థాయి బాల, బాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో టెన్త్ విద్యార్థులు మాహలక్ష్మి, ఎస్.కే.చారు, 9వ తరగతి విద్యార్థులు ఎస్.ముని, ఎం.ఎస్ నవీన్ కుమార్, కృష్ణకిషోర్, గోపిక ఎంపికైనట్లు తెలిపారు. అలాగే తిరుపతిలోని మంగళం ట్రెండ్స్ హైస్కూల్ నిర్వహించిన బేస్ బాల్ క్రీడల్లో 8వ తరగతి విద్యార్థులు ఎస్.బాలాజీ, పీ.రిషి ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 23న అనంతపురంలో, 28న బాలికలు కాకినాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

మార్మోగిన శివనామ స్మరణ





ముక్కంటి ఆలయం వద్ద దీపారాధన చేస్తున్న భక్తులు

శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం రెండవ సోమవారాన్ని పురస్కరించుకుని శైవ ఆలయాల్లో శంభో శంకరా అంటూ భక్తులు మొకరిల్లారు. ఆలయాలు శివ నామస్మరణతో మారుమోగాయి. మహిళలు స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ముక్కంటిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే పట్టణంలోని జెట్టిపాళెంలో కొలువైవున్న చక్రేశ్వరస్వామి ఆలయం, పిట్టల వారి సందులో ఉన్న దుర్గమల్లీశ్వరాలయం, కుందేటి వారి వీధిలోని బృహదీశ్వరాలయం, పానగల్‌లో సర్వ సంపదేశ్వరాలయం, ప్రాజెక్టు వీధి శివాలయం, తొట్టంబేడు మండలంలోని పెద్దకన్నలి వీరభద్రస్వామి ఆలయం, సింగమాలలోని శివాలయం, తొట్టంబేడులో శివాలయం, పట్టణ శివారు స్వర్ణముఖి నది ఒడ్డున కొలువై ఉన్న అర్ధనారీశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి మండలం వేడాం వెయ్యిలింగాలకోన, భైరవకోనలోని ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు.

వైభవంగా ప్రారంభమైన కార్తీక తెప్పోత్సవాలు





పద్మసరస్సుకు వేంచేస్తున్న స్వామిఅమ్మవార్లు - సరస్సులో తెప్పోత్సవం

నారాయణవనం, నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మావతి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో కార్తీక తెప్పోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీతాలక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి స్థానిక పద్మసరస్సులో తెప్పపై విహరించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం సీతా లక్ష్మణ సమేత రామచంద్రమూర్తికి అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామిఅమ్మవార్లు పద్మసరస్సుకు చేరుకుని తెప్పపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. స్వామివార్లను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ఏఈఓ రవి, ఆలయాధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తక్షణం రైతులకు పెట్టుబడి సాయం అందించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దారు లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. ఎన్నికల సందర్భంగా కూటమి పార్టీలు పలు హామీలను ప్రకటించాయని అందులో రైతులకు పెట్టుబడి సాయం ఒకటన్నారు. అయితే ఇంత వరకు సాయం ప్రకటించలేదని తెలిపారు. జనమాల గురవయ్య, మించల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: వినుత



శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గిరిజన హాస్టల్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత అన్నారు. పట్టణంలోని గిరిజన బాలికల హాస్టల్‌ను సోమవారం ఆమె సందర్శించారు. విద్యార్థులు పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆమె ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

వైభవంగా నగరోత్సవం



శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి నగరోత్సవం వైభవంగా జరిగింది. కార్తీక మాసం సోమవారం సందర్భంగా రాత్రి ఊరేగింపు జరిగింది. ముందుగా స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను అలంకార మండపంలో విశేషంగా అలంకరించారు. దూప దీప నైవేద్యాల సమర్పణ అనంతరం చతుర్మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు, కొబ్బరికాయలు సమర్పించారు.

కోర్టు తగదాలో ఉన్న భూమి పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కనమనంబేడు రెవెన్యూ పరిధిలోని కోర్టు తగదాలో ఉన్న భూమిని తహసీల్దార్ సుబ్రమణ్యం సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... పది సంవత్సరాలుగా సర్వే నెం.249-2లో 2.30 ఎకరాల భూమి కోర్టు తగదాలో ఉందన్నారు. ఈ భూమిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్రంథాలయ భవనం, తెలుగుంగ డీఈ కార్యాలయం, తెలుగుగంగ క్వార్టర్స్ బీసీ హాస్టల్, అంబేడ్కర్ భవనానికి కేటాయించిన స్థలంతో పాటు ఖాళీ జాగా ఉందన్నారు. ఈ భూమి తమదని బీఎన్‌కండ్రిగకు చెందిన రత్నమ్మ హైకోర్టులో కేసు వేసిందన్నారు. ఈ భూమలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి కోర్టుకు నివేదిస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు, మండల సర్వేయరు రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వాలీబాల్, కబడ్డీ టోర్నీ ప్రారంభం



బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో వి స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్, కబడ్డీ టోర్నీని ఎంఈవో రవీంద్రనాథ్, టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర నాయుడు ప్రారంభించారు. ఈ టోర్నీకి సత్యవేడు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు సుధాకర్ నాయుడు, శేఖర్‌నాయుడు, మోహన్‌రావు, చంద్రశేఖర్ బహుమతులు పంపిణీ చేశారు. పీడీలు కిషోర్, మస్తానయ్య, కుమార్ టోర్నీని పర్యవేక్షించారు.

సీపీఎం కన్వీనర్‌గా హరినాథ్

రేణిగుంట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సీపీఎం రేణిగుంట, ఏర్పేడు మండలాల కన్వీనర్‌గా హరినాథ్‌ను ఎన్నుకున్నారు. సోమవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ప్రాంతీయ మొదటి సభ జిల్లా కార్యదర్శి పుల్లయ్య ఆధ్వర్యంలో జరిగింది. భవిష్యత్తు పార్టీ కర్తవ్యాలు, పోరాటాలు, స్థానిక సమస్యలపై చర్చించారు. అనంతరం కన్వీనర్‌గా హరినాథ్‌ను ఎన్నుకున్నారు.

తేలని లెక్క రూ.6కోట్లు!

ఇంకా బాధ్యతలు అప్పగించని బదిలీ కార్యదర్శులు



రేణిగుంట పంచాయతీ కార్యాలయం

రేణిగుంట, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీలలో చేసిన ఖర్చులకు సంబంధించి రూ.6 కోట్లు లెక్క తేలలేదు. దీనికితోడు బదిలీ అయిన కార్యదర్శులు ఇంకా కొత్తగా వచ్చిన వారికి బాధ్యతలు అప్పగించ లేదు. ఫలితంగా పాలన గాడి తప్పుతోంది. సాధారణ బదిలీలలో భాగంగా పలు పంచాయతీ కార్యదర్శులను రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో బదిలీ చేసింది, వీరి స్థానంలో కొత్త కార్యదర్శులు వచ్చినా వారికి పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించి రికార్డులను స్వాధీనపరచలేదు. ఇది జరిగి ఒకటిన్నర నెల గడుస్తోంది. దీంతో పూర్తిస్థాయిలో పరిపాలన చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా కరకంబాడి పంచాయతీలో రూ.3కోట్లు, రేణిగుంట, తూకివాకం, జీపాళెం పంచాయతీలలో ఒక్కో కోటి రూపాయల వంతున లెక్కలు తేలాల్సి ఉంది. గత ఆరు నెలలుగా ఆడిటింగ్ నిర్వహించి నమోదు చేసిన ఎంబుక్ రికార్డులను సమర్పించకుండా పెండింగ్ నిధుల లెక్కలు మాత్రం నమోదు చేసి వెళ్లిపోయినట్లు చెబుతున్నారు. బదిలీ అయిన కార్యదర్శులు కొత్తవారికి ఆ రికార్డులను అందించకుండా తప్పించుకుంటున్నారు. తమ తప్పులు ఎక్కడ బయటపడతాయోనని పూర్వపు కార్యదర్శులు తప్పించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొత్తగా వచ్చిన కార్యదర్శులు తమకు రికార్డులు అందించి పూర్తిస్థాయిలో బాధ్యతలు అప్పగించాలని పలు మార్లు కోరినా బదిలీ అయిన కార్యదర్శులు మాత్రం ముందుకు రావడంలేదు. దీంతో ఈ విషయమై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇక లెక్క తేలని నిధులపై ప్రైవేటు ఆడిటింగ్ నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తేలని లెక్కల రికార్డులను స్వాధీనం చేసుకుని సమగ్రంగా విచారణ జరిపి నిజనిజాలను బహిర్గతం చేసి గాడి తప్పిన పంచాయతీల పాలనను చక్కబెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాప్రతినిధులు కోరుతున్నారు.

నయనానందకరం లక్ష దీపోత్సవం





స్వామిఅమ్మవార్ల చిత్రపటానికి విశేష పూజలు - వైష్ణవ కోనేరులో వెలుగుతున్న కార్తీక దీపాలు

శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా ఉన్న వైష్ణవ పుష్కరిణిలో కార్తీక మాసం రెండో సోమవారాన్ని పురస్కరించుకుని ప్రదోష వేళ లక్ష దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముక్కంటి ఆలయ అధికారులు ముందుగా పుష్కరిణి చుట్టూ నేతిదీపాలను సిద్ధం చేశారు. ప్రాంగణంలో స్వామిఅమ్మవార్ల చిత్రపటానికి విశేష పూజలు చేసి హారతులు సమర్పించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా లక్ష దీపోత్సవాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి నేతి దీపాలను ప్రజ్వలన చేశారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈ యేడాది తొలిసారిగా లక్ష దీపోత్సవాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ఈ విశేష వేడుకను గత సోమవారం నారద పుష్కరణిలో నిర్వహించారు. రెండో వారం వైష్ణవ కోనేరులో కొనసాగించారు. ఈ విశేష వేడుకను మహిళలు భక్తి శ్రద్ధలతో వీక్షించారు. నేతి దీపకాంతులతో పుష్కరణి తేజోమయంగా ప్రజ్వరిల్లింది.

భక్త జన సంద్రం ముక్కంటి ఆలయం



క్యూలో వేచి ఉన్న భక్తులు

శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయం సోమవారం భక్తజనసంద్రంగా మారింది. కార్తీక మాసం రెండో సోమవారం సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆదివారం నుంచే ఆలయంలో రద్దీ కొనసాగింది. ఆదివారం రాత్రి భక్తుల తాకిడితో పట్టణంలోని అతిథిగృహాలన్నీ నిండిపోయాయి. ఈ క్రమంలో సోమవారం వేకువజామున భక్తులు స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిఅమ్మవార్ల దర్శనం కోసం క్యూలైన్లలో బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 37 వేల మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. రూ.50 దర్శనం టిక్కెట్లు 2,937, రూ.200 శీఘ్రదర్శనం 2,977 అమ్ముడైనట్లు అధికారులు వెల్లడించారు. మొత్తంగా శివనామ స్మరణలో సోమవారం ముక్కంటి ఆలయం మారుమ్రోగింది.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన





శ్రీకాళహస్తి, పల్లం పాఠశాలల్లో జూమ్ మీటింగ్‌కు హాజరైన విద్యార్థులు

శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు జూమ్ యాప్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పలు పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల నియంత్రణ, చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై తీసుకుంటున్న చర్యలు, గంజాయి వంటి మత్తుపదార్థాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 1వ పట్టణ సీఐ గోపి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని పంగూరు, పల్లం, పాపానాయుడుపేట, కందాడు, బండారుపల్లి, ఏర్పేడు జడ్పీ ఉన్నత పాఠశాలల్లో రాష్ట్ర డీజీపీ నిర్వహించిన జూమ్ మీటింగ్ ప్రసారం చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు బాల్య వివాహాల నిర్మూలన, సైబర్ నేరాల నియంత్రణ, డగ్స్ వినియోగించడం వలన కలిగే అనర్థాలపై పలు అవగాహన కల్పించారు. తహసీల్దారు భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యం, సీఐ జయచంద్ర తదితరులు పాల్గొన్నారు. అలాగే రేణిగుంటలో డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాలల్లో అవగాహన కల్పించారు.

శాస్త్రోక్తంగా మృత్యుంజయుడికి అభిషేకం



శ్రీకాళహస్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయ స్వామికి సోమవారం శాస్త్రోక్తంగా అభిషేకం నిర్వహించారు. ముందుగా వినాయకుడికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి కర్పూర హారతులు ఇచ్చారు. అనంతరం మృత్యుంజయ స్వామిని పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చ కర్పూరంలో అభిషేకించారు. అనంతరం వివిధ పుష్పాలతో, గజమాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

నైవేద్య పాత్రల వితరణ



శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయానికి చెన్నైకు చెందిన శ్రీనివాస్ చౌదరి రూ.92,332 విలువైన ఏడు పెద్ద నైవేద్య పాత్రలు, ఆరు చిన్న నైవేద్య పాత్రలను అందజేశారు. వీటిని ఆలయ అధికారులు స్వీకరించి దాతకు కృతజ్ఞతలు తెలిపారు. స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయన్ను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో విత్తనాలు



సచివాలయాలకు చేరుతున్న వేరుశనగ విత్తనాలు

కేవీబీపురం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో వేరుశనగ సాగు చేసే రైతులకు సకాలంలో విత్తనాలు అందిస్తామని వ్యవసాయాధికారి మురళీకృష్ణకుమార్ చెప్పారు. మండలంలో రబీలో 17వేల హెక్టార్లలో వేరు శనగ సాగు చేయడానికి దుక్కులు దున్నారన్నారు. ఈ మేరకు మండలానికి 1,200 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని చెప్పారు. ప్రస్తుతం 600 క్వింటాళ్ల విత్తనకాయలు చేరాయన్నారు. వాటిని సచివాలయాలకు తరలిస్తున్నామన్నారు. త్వరలోనే పంపిణీ చేస్తామని చెప్పారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ



పిచ్చాటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడియూరు సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో సోమవారం వ్యవసాయ అధికారి సంజీవరెడ్డి వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాల కాయలను దుర్వినియోగం చేస్తే ప్రభుత్వం తరఫున అందించే పథకాలు వర్తించవని హెచ్చరించారు. 30 కిలోల బస్తా రూ.1728కి అందిస్తున్నామని చెప్పారు. అలాగే మినుములు కూడా అందుబాటులో ఉన్నాయని ఏవో తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిశేఖర్‌రెడ్డి, గోపి, మాజీ సర్పంచు గుండయ్య, వ్యవసాయ అసిస్టెంట్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

అబుల్ కలాం ఆజాద్‌కు సుధీర్ నివాళి



అయ్యన్నతో కలిసి నివాళులర్పిస్తున్న సుధీర్

శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అమరావతిలోని అసెంబ్లీ ఆవరణలో సోమవారం ఘనంగా భారత స్వాతంత్ర్య సమర యోధుడు, మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జయంతి వేడుకలను నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడు గంగమ్మల జాతరలో రాజకీయ చిచ్చు రేపొద్దు

శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైభవంగా జరిగే ఏడుగంగమ్మల జాతరలో రాజకీయ చిచ్చు రేపడం తగదని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రతి గంగమ్మ వద్ద నిర్వహణ కోసం అనాదిగా స్థానికులే కమిటీలను ఏర్పాటు చేసుకుని కొనసాగుతున్నారన్నారు. ప్రస్తుతం గంగమ్మ కమిటీలను రద్దు చేసి టీడీపీ నాయకులను పెట్టుకునేందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రయత్నాలు చేయడం భావ్యం కాదన్నారు. ముక్కంటి ఆలయ టెండర్ల నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దందాల బతుకు మానుకో...

మాజీ ఎమ్మెల్యేకు టీడీపీ హితవు

శ్రీకాళహస్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): దందాలతో సాగించే బతుకు మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మానుకోవాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ హెచ్చరించారు.పట్టణంలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ప్రజలు తిరస్కరించినా మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి దిగజారుడు రాజకీయం మానుకోవడం లేదన్నారు. బొజ్జల కుటుంబం నీతి నిజాయితీకి ప్రతిరూపంగా పని చేస్తుందన్నారు. ఏడు గంగమ్మల జాతర పేరుతో కొందరు వైసీపీ నాయకులు కమిటీలుగా ఏర్పడి భారీగా పట్టణ వ్యాపారుల నుంచి చందాలు వసూలు చేస్తూ దందాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ ఏడాది ప్రజల నుంచి ఒక రూపాయి వసూలు చేయకుండా ముక్కంటి ఆలయం తరఫున జాతర నిర్వహించేందుకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సంకల్పించారని చెప్పారు.